


నమస్తే

# మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

గురువారం

21-05-2026 సంపుటి : 01 సంచిక :60 పేజీలు : 08 వెల :₹ 5/-

తెలుగు దినపత్రిక




Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com



## ఆసిఫాబాద్ లో ఇందిరమ్మ పండుగకు రాష్ట్ర ముఖ్యమంత్రి రాక

- రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తుంది
- రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర
- సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఆసిఫాబాద్ మే 20 (మహాప్రభ )

కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో జూన్ 2వ తేదీన జరగనున్న ఇందిరమ్మ పండుగలు రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొంటారని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్న ప్రాంతాలను బుధవారం రాష్ట్ర అబ్కారీ –మద్య నిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, అధికారులతో కలిసి సందర్శించి ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం,

-మిగతా 3 లో



## జనగణనలోనే కులగణన

- మినహాయించాలని పిల్ కొట్టివేసిన సుప్రీంకోర్టు
- సంక్షేమ పథకాలు అమలుకు బడుగుల సంఖ్య తెలియాల్సిందేనని వ్యాఖ్య
- ఈ అంశంలో న్యాయస్థానం జోక్యం చేసుకునే అవసరం లేమన్న ధర్మాసనం
- 2027 జనగణన నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.11,718 కోట్లు వెచ్చింపు

న్యూఢిల్లీ :మే 20 (మహాప్రభ )

జనాభా లెక్కల్లో కులాల వివరాల సేకరణను మినహాయించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. ఇది విధానపరమైన అంశమని అందువల్ల జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. వెనుకబడిన వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే వారి సంఖ్య ప్రభుత్వానికి తెలియాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏజెన్సీలు కులగణన సమాచారాన్ని దుర్వినియోగం చేసే అవకాశం

-మిగతా 3 లో

## నా శవంపై కాషాయ జెండా కప్పాల్సిందే

### ఫాల్తుగాళ్లు చేసే ప్రచారాన్ని పట్టించుకోను




- బీఆర్ఎస్ ఎంపీలతో కేంద్రం నడుస్తుందనుకుంటున్నారేమో
- బీఆర్ఎస్ గడీలు బద్దలు కొట్టాననే ఆక్రోశంతో కేటీఆర్
- నా కొడుకుపై ఆరోపణలు వస్తే నేను పోలీసులకు అప్పగించా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



హైదరాబాద్ మే 20 (మహాప్రభ )

ఉరిశిక్ష వేసే ముందు మీ చివరి కోరిక ఏమిటని బీజేపీలో కమిట్ మెంట్ తో పనిచేసే ఏ కార్యకర్తను అడిగితే చెప్పేది ఒక్కటే "నేను చచ్చిపోయాక నా శవంపై కాషాయ జెండా కప్పాలని అడుగుతారు. నాది అదే చివరి కోరిక కూడా". అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. బండి సంజయ్ కొత్త పార్టీ పెడుతున్నారంటూ కొందరు ఫాల్తుగాళ్లు ప్రచారం చేస్తున్నారని, అట్లాంటి వాటికి స్పందించాల్సిన అవసరమే లేదని చెప్పారు. ఈరోజు కేంద్ర మంత్రి బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి విచ్చేశారు. బండి సంజయ్

-మిగతా 3 లో



## అవినీతిపై..ఉక్కుపాదం

- తమిళనాడు సీఎం విజయ్ సంచలన పథకం
- ప్రభుత్వ ఉద్యోగులలో అవినీతి అంతానికి కొత్త నిర్ణయం
- రూ. వెయ్యి లంచం తీసుకున్నట్లు ఆధారాలు చూపితే లక్ష రివార్డ్
- ప్రజలకు బంపర్ ఆఫర్ ప్రకటించిన దళపతి
- పదింటికే ఉద్యోగులు సచివాలయానికి రావాలని నోటీస్

3

### వెయ్యి లంచానికి.. లక్ష రివార్డ్!



## మెడికల్ షాప్‌ల బంద్ సక్సెస్!

- ఆన్‌లైన్ ఫార్మసీలపై తిరుగుబాటు..
- ఇంటర్నెట్ ఔషధ విక్రయాలకు వ్యతిరేకంగా 'ఆల్ ఇండియా కెమిస్ట్స్' గర్జన
- పిస్క్రిప్షన్ లేని విచ్చలవిడి బిజినెస్‌తో లైసెన్స్‌డ్ డ్రగ్గిస్టులకు భారీ నష్టం
- మానవతా దృక్పథంతో అత్యవసర మందుల సరఫరా.. రోగులకు తప్పిన ఇబ్బందులు
- కలెక్టర్ల ద్వారా ప్రధానికి వినతిపత్రాలు సమర్పించిన అసోసియేషన్

న్యూఢిల్లీ మే 20 (మహాప్రభ )

ఆన్‌లైన్‌లో విచ్చలవిడిగా జరుగుతున్న ఔషధాల విక్రయాన్ని నిరసిస్తూ ఆల్ ఆండియా కెమిస్ట్స్, అండ్ డ్రగ్గిస్టల యూనియన్ దేశ వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఒక రోజు సమ్మె విజయవంతమైంది. మానవతా దృష్టితో తాము తీసుకున్న నిర్ణయం కారణంగా అత్యవసర, ముఖ్యమైన మందులు అవసరమైన రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాలేదని యూనియన్ పేర్కొన్నది.దేశంలోని తమ అసోసియేషన్ సభ్యులుగా ఉన్న వారందరూ సమ్మెలో పాల్గొని పూర్తిగా విజయవంతం

-మిగతా 3 లో



## నేటి నుంచి సరస్వతీ పుష్కరాలు

- సరస్వతీ అంత్య పుష్కరాలకు ఘనంగా ఏర్పాట్లు..
- 30 నుంచి 40 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు
- భక్తులకు సీఎం శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ మే 20 ( మహాప్రభ )

సరస్వతీ అంత్య పుష్కరాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మే 21వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందని తెలిపారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు తరలి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. భక్తుల రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చేయాలని చెప్పారు.

-మిగతా 3 లో




## ఇన్వెస్ట్ తెలంగాణ



### పెట్టుబడుల ఆకర్షణ కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు

- ఎస్కార్ట్ ఆఫీసర్‌గా గ్రూప్-1 అధికారి
- తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాల అధ్యయనం
- బుల్లెట్ ట్రైన్ కోసం భూసేకరణ
- డేటా సిటీ కోసం 1,500 ఎకరాలు
- ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్ట్ లకు 500 ఎకరాలు
- భారత్ ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్ మే 20 ( మహాప్రభ )

రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. దీని కోసం ప్రత్యేక వెబ్‌సైట్, లోగోను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ ప్రత్యేక కార్యాలయాన్ని భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసి, దానికి గ్రూప్–1 అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించాలని సూచించారు. తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లోని పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేసి, తెలంగాణ పాలసీని అంతకంటే మెరుగ్గా, ఆకర్షణీయంగా రూపొందించాలని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు,

-మిగతా 3 లో








## మెలోనికి మెలోడీ..


- టాఫీలను బహూకరించిన ప్రధాని మోదీ
- రోమ్ వీధుల్లో లేట్‌నైట్ విహారం

రోమ్ మే 20 (మహాప్రభ )


ప్రధాని నరేంద్ర మోదీ ఇటలీ పర్యటన సందర్భంగా ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనికి ఒక ప్యాక్ మెలోడీ టాఫీలను బహుమతిగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో పోస్ట్ చేసిన ఒక వీడియోలో.. నీలిరంగు బంద్‌గాలా సూట్‌లో ఉన్న ప్రధాని తెల్లసూట్‌లో ఉన్న మెలోనీకి ప్రసిద్ధ మెలోడీ క్యాండీల బ్యాగ్‌ను అందజేస్తుండగా, ఇద్దరు ప్రధానులు నవ్వుతూ కన్పించారు. కాగా, బుధవారం జరిగే దౌత్య సమావేశానికి ముందు మోదీ, మెలోనీ మంగళవారం సాయంత్రం రోమ్‌లో ఆహ్లాదంగా విహరించారు. కారు ప్రయాణం, డిన్నర్ సమావేశం, ప్రత్యేక కొలోసియం సందర్శనలో పాల్గొన్నారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా మంగళవారం ఇటలీకి చేరిన ప్రధాని మోదీకి మెలోనీ స్వాగతం పలికారు. పర్యటనకు సంబంధించిన గ్లింప్స్‌ను ఇద్దరు నేతలు సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు.

-మిగతా 3 లో

## జమిలి ఎన్నికలతో రూ.7 లక్షల కోట్ల ఆదా



3 లో



## సూర్యాస్త్ర ప్రయోగం సక్సెస్

- భారత రక్షణ వ్యవస్థకు 'నిబే' అస్త్రం!
- స్వదేశీ పరిజ్ఞానంతో లాంగ్ రేంజ్ రాకెట్ సిస్టమ్ రూపకల్పన
- 150 కి.మీ, 300 కి.మీ వెర్షన్లలో అద్భుత కచ్చితత్వం
- ఆర్మీ కొనుగోళ్లకు కేంద్రం సిద్ధం.. విదేశీ దిగుమతులకు బ్రేక్

న్యూఢిల్లీ: మే 20 (మహాప్రభ )

దేశీయ రక్షణ రంగంలో సరికొత్త మైలురాయి నమోదైంది. 'నిబే లిమిటెడ్' అనే ప్రైవేట్ సంస్థ పూర్తి స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన 'సూర్యాస్త్ర' లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్ సిస్టమ్‌ను ఒడిశాలోని చాందీపూర్ నుంచి విజయవంతంగా పరీక్షించారు.

-మిగతా 3 లో

# బంగ్లాదేశ్‌లో భారతీయ దౌత్యవేత్త అనుమానాస్పద మృతి..

### గుండె పోటే కారణమా..?




**న్యూఢిల్లీ మే 20 (మహాప్రభ )**
బంగ్లాదేశ్‌లో భారత దౌత్యవేత్త అనుమానాస్పదంగా మరణించాడు. మంగళవారం అతడి మృతదేహాన్ని దౌత్య కార్యాలయ ప్రాంగణంలో గుర్తించారు. ఈ ఘటన బంగ్లాదేశ్, చట్టోగ్రామ్‌లో జరిగింది. మృతుడిని నరేన్ ధర్‌గా గుర్తించారు. స్థానిక అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఛట్టోగ్రామమ్‌లో నరేన్ ధర్ అనే అధికారిక భారత దౌత్య కార్యాలయంలో అసిస్టెంట్ ప్రోటోకాల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు.మంగళవారం ఉదయం అతడి మృతదేహాన్ని ఓల్డ్ వీసా సెంటర్ బిల్డింగ్ పరిధిలో గుర్తించారు. సెకండ్ ఫ్లోర్‌లోన బాత్‌రూమ్ డోర్ వద్ద నరేన్ మృతదేహం పడి ఉంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. దౌత్య అధికారి కాబట్టి, అదనపు ప్రోటోకాల్ పాటిస్తూ అతడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు బంగ్లాదేశ్ పోలీసు అధికారులు తెలిపారు. నరేన్ మృతదేహాన్ని ఛట్టోగ్రామ్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం పంపించినట్లు సిటీ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ అమినూర్ రషీద్ తెలిపారు. అతడి మృతికి గల కారణాలు తెలియలేదన్నారు. కార్డియాక్ అరెస్ట్ కారణంగానే నరేన్ మరణించి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తర్వాతే అతడి మృతికి గల అసలు కారణాలు తెలుస్తాయని రషీద్ తెలిపారు. అలాగే, ఆయన మృతి ఘటనలో అనుమానాస్పదంగా ఏమీ అనిపించలేదని పోలీసులు చెప్పారు. అయినప్పటికీ అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతామన్నారు. నరేన్.. ఇండియాలోని చండీగఢ్‌కు చెందినట్లుగా తెలుస్తోంది. ఈ అంశం గురించి ఢాకాలోని భారత రాయబార కార్యాలయం నుంచి ప్రకటన రావాల్సి ఉంది.

# మోదీపై నార్వే పత్రిక అభ్యంతరకర కార్టూన్



**న్యూఢిల్లీ మే 20 ( మహాప్రభ )**
ప్రధాని మోదీని పాములవాడిగా చిత్రీకరిస్తూ నార్వే వార్తాపత్రికలో ప్రచురించిన ఒక కార్టూన్ తీవ్ర వివాదానికి దారితీసింది. సామాజిక మాధ్యమంలో విస్తృతంగా ప్రచారం కావడంతో ఈ చర్యను పలువురు నెటిజన్లు నిరసిస్తూ తీవ్రంగా తప్పుబట్టారు.నార్వేలోని ప్రముఖ దినపత్రిక ఆఫ్టన్‌పోస్ట్‌లో ప్రచురితమైన ఈ కార్టూన్‌లో మోదీని ఒక పాములు పట్టేవాడిగా చిత్రించారు. ఇందులో మోదీ నాదస్వరం ఊదుతుండగా, పెట్రోల్ బంక్‌లోని ఇంధన పైపు పాములా ఆడుతున్నట్టు చిత్రీకరించారు. ఈ కార్టూన్‌కు 'ఒక తెలివైన, కాస్త చికాకు కలిగించే వ్యక్తి' అని శీర్షిక పెట్టారు.


# పేలవంగానే కీలక రంగాల ఉత్పత్తి



**న్యూఢిల్లీ మే 20 ( మహాప్రభ )**
దేశంలోని ఎనిమిది కీలక మౌలిక వసతుల రంగాల వృద్ధి అంతంత మాత్రంగానే నమోదయ్యింది. బుధవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 2026 ఏప్రిల్ నెలలో కీలక రంగాల ఉత్పత్తి 1.7 శాతం వృద్ధికి పరిమితమయ్యాయి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో 40.27 శాతం వాటా కలిగిన ఈ రంగాలు మార్చి నెలలో 1.2 శాతంగా నమోదయ్యింది. ఈ ఎనిమిది రంగాలలో ఏప్రిల్ నెలలో సిమెంట్ ఉత్పత్తి అత్యధికంగా 9.4 శాతం వృద్ధిని సాధించగా, స్టీల్ ఉత్పత్తి 6.2 శాతం, విద్యుత్ ఉత్పత్తి 4.1 శాతం వృద్ధిని నమోదు చేశాయి. అయితే, ఇంధన, కమోడిటీ రంగాలలోని బలహీనత వల్ల మిగిలిన ఐదు రంగాలు క్షీణతను చవిచూశాయి. ముఖ్యంగా బొగ్గు ఉత్పత్తి 8.7 శాతం, ఎరువులు 8.6 శాతం, సహజ వాయువు 4.3 శాతం, ముడి చమురు 3.9 శాతం, పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తులు 0.5 శాతం చొప్పున పడిపోయాయి.

## శత్రువులను పూర్తిగా ఛిద్రము చేస్తాం: ఇరాన్

**హైదరాబాద్ మే 20 ( మహాప్రభ )**



ప్రస్తుతం పశ్చిమాసియాలో శాంతిచర్చల పేరుతో ఇరాన్-అమెరికా మధ్య కాల్పుల విరమణ కొనసాగుతోంది. అయితే రెండు దేశాల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుతోంది. శాంతి చర్చలకు ఇరాన్ తొందరగా అంగీకరించాలని, లేకుండా తీవ్ర పరిణామాలు ఉంటాయని ట్రంప్ హెచ్చరించారు. తాజాగా ట్రంప్ వ్యాఖ్యలకు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ ఘాటు హెచ్చరికలు జారీ చేసింది.'ఇరాన్‌పై మళ్లీ దాడులు జరిగితే.. ఈసారి పశ్చిమాసియా ప్రాంతాన్ని దాటి యుద్ధం మరింత విస్తరిస్తుంది. మా విధ్వంసక దాడులు శత్రువులను పూర్తిగా ఛిద్రము చేస్తాయి." అని వార్నింగ్ ఇచ్చింది. "ఇరాన్ మాత్రం ఇప్పటివరకు తమ పూర్తి సైనిక శక్తిని ఉపయోగించలేదని స్పష్టం చేసింది. ప్రపంచంలోని అత్యంత ఖరీదైన రెండు సైన్యాల పూర్తి శక్తితో అమెరికా-జియోనిస్టు బలగాలు మాపై దాడి చేశాయి. అయినా మేము ఇప్పటికీ ఇస్లామిక్ పూర్తి శక్తిని వినియోగించలేదు" అని IRGC పేర్కొంది.

# కాంగ్రెస్ కరువు తీర్చిన విజయ్..

### తమిళనాడులో 59 ఏళ్ల తర్వాత మంత్రివర్గంలో చోటు

**న్యూఢిల్లీ మే 20 (మహాప్రభ )**
తమిళనాడులో సీఎం విజయ్ పుణ్యమా అని కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వచ్చినట్లే కనిపిస్తోంది. ఆ రాష్ట్రంలో 59 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ మంత్రివర్గంలో చోటు దక్కించుకోనుంది. గురువారం ఏర్పడనున్న క్యాబినెట్‌లో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటు కల్పిస్తూ టీవీకే అధినేత, సీఎం విజయ్ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ప్రకటించారు.కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజేష్ కుమార్, పి.విశ్వనాథన్‌లు విజయ్ మంత్రివర్గంలో చేరబోతున్నట్లు వెల్లడించారు. తమిళనాడులో కాంగ్రెస్




పార్టీకి ఇది చారిత్రక సందర్భం అని, 59 ఏళ్ల తర్వాత ప్రభుత్వంలో చేరబోతున్నామని వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా తమ పార్టీ నుంచి మంత్రులుగా చేరనున్న ఎమ్మెల్యేలకు వేణుగోపాల్ శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ.. డీఎంకేతో కలిసి పోటీ చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఫలితాల అనంతరం కాంగ్రెస్ పార్టీ.. డీఎంకే కూటమి నుంచి బయటకు వచ్చి టీవీకేతో చేరింది. టీవీకే ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించింది. 234 అసెంబ్లీ స్థానాలున్న తమిళనాడులో ఏ పార్టీకీ మెజారిటీ రాలేదు. టీవీకే అత్యధికంగా 107 సీట్లు సాధించింది. అధికారం ఏర్పాటు చేసేందుకు 118 సీట్లు అవసరం. దీంతో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్, వీసీకే పార్టీలతో కలిసి కూటమిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఏఐఏడీఎంకే తిరుగుబాటు ఎమ్మెల్యేలు కూడా విజయ్ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారు. దీంతో విజయ్ ప్రభుత్వం అవిశ్వాసం నెగ్గింది. విజయ్ పార్టీకి మెజారిటీ రాకపోవడం అనుకోకుండా కాంగ్రెస్ పార్టీకి కలిసివచ్చింది. మంత్రివర్గంలో చేరేందుకు అవకాశం కల్పించింది.

## సోషల్ మీడియాను ఊపేస్తోన్న

# కాక్‌రోచ్ జనతా పార్టీ'..

### కేవలం 76 గంటల్లోనే 45 లక్షల మంది ఫాలోవర్లు

**న్యూఢిల్లీ మే 20 (మహాప్రభ )**
సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో సోషల్ మీడియాలో పుట్టుకొచ్చిన ఒక వ్యంగ్య రాజకీయ పార్టీ ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. కేవలం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , కాన్వా డిజైన్ల సహాయంతో రాత్రికి రాత్రే ఏర్పాటైన ఈ 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (జజీూ) కేవలం 76 గంటల్లోనే ఏకంగా 45 లక్షల (4.5 మిలియన్ల) పైగా ఫాలోవర్లతో దూసుకుపోతోంది. 30 ఏళ్ల పబ్లిక్ రిలేషన్స్ విద్యార్థి, మాజీ పొలిటికల్ సోషల్ మీడియా వాలంటీర్ అభిజీత్ దిప్కే ఈ వినూత్న డిజిటల్ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ పార్టీకి ఒక రాజ్యాంగం, ప్రత్యేక వెబ్‌సైట్, ఐదు సూత్రాల మేనిఫెస్టో కూడా ఉంచింది.ఇటీవల ఒక కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ, ఉద్యోగాలు లేక సమాజంలో సరైన స్థానం దొరకని కొందరు యువకులు బొద్దింకల (కాక్‌రోచ్‌లు) లాగా తయారవుతున్నారని, వారు ఆర్టీఐ కార్యకర్తలుగా మారి అందరిపై విమర్శలు చేస్తున్నారంటూ సంచలన వ్యాఖ్యలు చేశాడు. అయితే దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, అవినీతి, రుపాయి పతనం, ఇంధన ధరలు, పేపర్ లీకేజీల సమస్యలతో ఇప్పటికే తీవ్ర అసంతృప్తితో ఉన్న యువతకు ఈ వ్యాఖ్యలు తీవ్ర




ఆగ్రహాన్ని తెప్పించాయి. వ్యవస్థ తమను బొద్దింకలుగా చూస్తే, ఆ బొద్దింకలన్నీ ఏకమైతే ఎలా ఉంటుందో చూపిస్తామంటూ అభిజీత్ దిప్కే ఈ 'కాక్‌రోచ్ జనతా పార్టీ'ని స్థాపించాడు. దీంతో ఈ పార్టీని స్థాపించి సోషల్ మీడియాలో జాయిన్ అయితే కొద్ది గంటల్లోనే ఈ పార్టీకి విపరీతమైన మద్దతు లభించింది. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు, ఎక్స్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియాలలో ఈ పార్టీకి దూసుకుపోతుంది. అయితే, తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని, నకిలీ డిగ్రీలతో వ్యవస్థను తప్పుదోవ పట్టించే వారిని ఉద్దేశించి మాత్రమే తాను ఆ వ్యాఖ్యలు చేశానని సీజేఐ తర్వాత వివరణ ఇవ్వగా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. మరోవైపు తమను తాము 'సోమరులు మరియు నిరుద్యోగుల గొంతుక'గా ప్రకటించుకున్న ఈ పార్టీ, తమ నినాదాన్ని 'సెక్యులర్, సోషలిస్ట్, డెమొక్రటిక్ మరియు లేజీ (సోమరి)' అని పిలుచుకుంటోంది. అలాగే ఈ పార్టీలో చేరడానికి వింతైన అర్హతలను కూడా పెట్టింది. ఇందులో చేరేవారు బలవంతంగా లేదా ఇష్టపూర్వకంగా నిరుద్యోగి అయి ఉండాలని, రోజుకు కనీసం 11 గంటల పాటు ఫోన్ లేదా ఇంటర్నెట్ వాడుతూ ఉండాలి, అలాగే నిత్యం సోషల్ మీడియాలో ప్రజా సమస్యలపై గళం విప్పే అలవాటు ఉండాలని తెలిపింది. అలాగే వీరు విడుదల చేసిన ఐదు సూత్రాల మేనిఫెస్టో మాత్రం భారత రాజకీయ, వ్యవస్థాగత లోపాలపై తీవ్రంగా స్పందిస్తోంది. రిటైర్మెంట్ తర్వాత ఏ ప్రధాన న్యాయమూర్తికీ రాజ్యసభ సీటు ఇవ్వకూడదని, ఓటర్ల జాబితా నుండి అర్హులైన ఓట్లు తొలగిస్తే చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ను ఉపా (ఖ్యూూూ) చట్టం కింద అరెస్ట్ చేయాలని, పార్లమెంటు మరియు క్యాబినెట్‌లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఈ మేనిఫెస్టో డిమాండ్ చేస్తోంది. కార్పొరేట్ సంస్థల చేతుల్లో ఉన్న మీడియా లైసెన్సులను రద్దు చేసి స్వతంత్ర మీడియాకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఒక పార్టీ నుండి గెలిచి మరో పార్టీలోకి మారే ఎమ్మెల్యేలు లేదా ఎంపీలపై 20 ఏళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని కూడా పేర్కొంది. అలాగే ఈ పార్టీ ఆర్టీఐ పరిధిలోకి వస్తుందని, ఎలాంటి రహస్య విరాళాలు తీసుకోబోమని స్పష్టం చేసింది.

# దేశంలో రాజ్యాంగంపై నిరంతరం దాడి


**న్యూఢిల్లీ మే 20 (మహాప్రభ )**
: దేశంలో రాజ్యాంగంపై నిరంతరం దాడి జరుగుతోందని లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. బుధవారం తన పార్లమెంటరీ నియోజకవర్గమైన రాయ్‌బరేలీలో పర్యటించారు. అక్కడ నిర్వహించిన -బహుజన స్వాభిమాన్ సభ'లో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో రాజ్యాంగంపై నిరంతరం దాడి జరుగుతోందని, అది కేవలం ఒక సాధారణ పత్రం కాదని, డా.బి.ఆర్. అంబేద్కర్, మహాత్మాగాంధీ, వీరపాసి వంటి మహనీయుల సిద్ధాంతాలకు, అలాగే కేరళలో నారాయణ గురు, కర్ణాటకలో బసవన్న వంటి సంస్కర్తల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. బుద్ధుడు, గురునానక్, కబీర్ వంటి వారి గొంతుకలు కూడా రాజ్యాంగంలో ప్రతిబింబించాయని, అలాంటి పత్రాన్ని తప్పక పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజలు కేవలం మహనీయుల విగ్రహాలకు నివాళులు అర్పించడమే కాకుండా,



రాజ్యాంగంపై మరియు అది సూచించిన భావజాలంపై దాడులు జరిగినప్పుడు వాటిని రక్షించుకునేందుకు ఎదురుతిరగాలని ఆయన పిలుపునిచ్చారు. భారతదేశం ప్రతి ఒక్కరిదీ అని, ఏ కులానికో, ఒక వ్యక్తికో, బిలియనీర్‌కో లేదా సంస్థకో చెందినది కాదని స్పష్టం చేశారు.ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల చేసిన పొదుపు సూచనలను ప్రస్తావిస్తూ, రాబోయే నెలల్లో ద్రవ్యోల్బణం తీవ్రంగా పెరుగుతుందని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఆహార ధాన్యాలు అన్నింటి ధరలు పెరుగుతాయని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. విదేశాలకు వెళ్లవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసిన ప్రధాని, ఆ వెంటనే తానే స్వయంగా ఐదు దేశాల పర్యటనకు వెళ్లారని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచడం, కులగణన నిర్వహించకపోవడం, కొందరు పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా వ్యవహరించడం ద్వారా ప్రధాని మోడీ రోజుకు 24 గంటలు రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని మండిపడ్డారు. దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి అంబానీ, అదానీ వంటి పెద్ద పారిశ్రామికవేత్తల లాభాలకే ప్రభుత్వం ప్రాముఖ్యతనిస్తోందని ఆరోపించారు. అంతకుముందు రాయ్‌బరేలీ పర్యటనలో భాగంగా రాహుల్ గాంధీ విప్లవకారుడు వీరపాసికి ఘనంగా నివాళులర్పించారు. మహనీయులను స్మరించుకుంటున్నాం కానీ, వారి సిద్ధాంతాలపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవడంలో వెనుకబడుతున్నామని, ఈ ధోరణి మారాలని ఆయన అభిప్రాయపడ్డారు.

# ట్రంప్ దూకుడుకు సెనెట్ కళ్లెం

**వాషింగ్టన్, మే 20 ( మహాప్రభ )**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ క్లళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. ఫిబ్రవరి చివరిలో ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ఇరాన్ పై యుద్ధానికి దిగారు. యుద్ధంపై ట్రంప్ అధికారాలను పరిమితం చేసేందుకు డెమొక్రట్లు అనేకసార్లు సెనెట్‌లో ఓటింగ్ నిర్వహించారు. అయితే, వారి తీర్మానాలకు తగినంత ఓటింగ్ లభించలేదు. డెమొక్రటిక్ సెనెటర్ టిమ్ కెయిన్ తాజాగా మరోసారి సెనెట్ ముందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. యుద్ధ ప్రకటన, సైనిక చర్యకు కాంగ్రెస్ నుంచి స్పష్టమైన ఆమోదం లభిస్తే



తప్ప.. ఇరాన్ లోపల లేదా దానికి వ్యతిరేకంగా జరిగే ఘర్షణల్లో యూఎస్ దళాలు పాల్గొనకూడదని అందులో తెలిపారు. దీనికి 50 మంది అనుకూలంగా.. 47 మంది వ్యతిరేకంగా ఓట్లు వేశారు. ఈ తీర్మానం ఆమోదంలో నలుగురు రిపబ్లికన్ సభ్యులు కూడా మద్దతుగా ఓటు వేయడం గమనార్హం. కాగా.. ఈ బిల్లు ఆమోదానికి సంబంధించి త్వరలో తుది ఓటింగ్ జరగనుంది. ఇది చట్టంగా మారితే.. కాంగ్రెస్ అధికారికంగా సైనిక దాడి కొనసాగించడానికి అనుమతి ఇచ్చేవరకు ట్రంప్ ఇరాన్‌పై ఎలాంటి దాడులకు దిగకూడదు. ఓటింగ్ సందర్భంగా డెమొక్రటిక్ సెనెట్ చక్ షుమర్ మాట్లాడుతూ.. యుద్ధానికి సంబంధించిన నిర్ణయాలపై కాంగ్రెస్ తిరిగి పర్యవేక్షణ చేపట్టాలన్నారు. 'ఈ అధ్యక్షుడు నిండుగా తూటాలున్న తుపాకీతో ఆడుకుంటున్న చిన్నపిల్లాడిలా ఉన్నాడు' అని వ్యాఖ్యానించారు. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చలు కొనసాగుతోన్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# అవినీతిపై.. ఉక్కుపాదం

**-వెయ్యి లంచానికి.. లక్ష రివార్డ్!**
**-తమిళనాడు సీఎం విజయ్ సంచలన పథకం**
**-ప్రభుత్వ ఉద్యోగులలో అవినీతి అంతానికి కొత్త నిర్ణయం**
**-రూ. వెయ్యి లంచం తీసుకున్నట్లు ఆధారాలు చూపితే లక్ష రివార్డ్**
**-ప్రజలకు బంపర్ ఆఫర్ ప్రకటించిన దళపతి**
**-పదింటికే ఉద్యోగులు సచివాలయానికి రావాలని నోటీస్**



**న్యూఢిల్లీ :**

హామీలు నెరవేర్చే దిశగా..

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా టీవీకే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రచార సమయంలోనే తాము అధికారంలోకి వస్తే ఆధార్ కార్డు తరహాలో తమిళనాడు పౌరసత్వ కార్డును జారీ చేస్తామని ప్రకటించింది. ప్రతి కుటుంబం సమగ్ర సమాచారంతో కూడిన ఈ కార్డు ద్వారా, పౌరులు ఎలాంటి దరఖాస్తులు చేసుకోకుండా లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా పుట్టినప్పటి నుంచే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలన్నీ నేరుగా వారి ఇంటి వద్దకే శాస్త్రీయ పద్ధతిలో అందుతాయని హామీ ఇచ్చారు. ప్రస్తుతం 108 సీట్లతో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విజయ్, అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం క్షేత్రస్థాయిలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే మంత్రి అథవ్ అర్జున తొలిసారిగా ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి, పరిపాలనా పారదర్శకతను పెంచే చర్యలపై చర్చించారు.

## మెడికల్ షాప్‌ల బంద్ సక్సెస్!

మొదటి తరువాయి

చేసినట్టు సంస్థ అధ్యక్షుడు జేఎస్ షిండే, ప్రధాన కార్యదర్శి రాజీవ్ సింఘాల్ పేర్కొన్నారు. తమ సమస్యలకు సంబంధించి డివిజనల్ కమిషనర్లు, జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారుల ద్వారా ప్రధానికి వినతిపత్రం సమర్పించినట్టు చెప్పారు. ఎలాంటి నియంత్రణ, ప్రిస్క్రిప్షన్‌లు లేకుండా అక్రమంగా ఆన్‌లైన్‌లో భారీ డిస్కౌంట్‌లతో ఔషధాలు విక్రయిస్తుండటంతో దేశ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది లైసెన్స్‌డ్ కెమిస్టులు, డ్రగ్గిస్టులకు తీవ్ర నష్టం ఏర్పడుతున్నదని చెప్పారు.

## నేటి నుంచి సరస్వతీ పుష్కరాలు

మొదటి తరువాయి

ఎండలు ఎక్కువగా ఉన్నందున భక్తులు ఆరోగ్యం కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పుష్కరాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా జరగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ పుష్కర శుభాకాంక్షలు తెలిపారు. మే 21వ తేదీ ఉదయం 5:43 గంటలకు తొలి పుష్కర స్నానంతో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభంకానున్నాయి. తొలి పుష్కర స్నానం కంచి స్వామి విజయేంద్ర సరస్వతి చేయనుండగా, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం కానుంది. 12 రోజుల పాటు కొనసాగే ఈ పుష్కరాలకు సుమారు 30 నుంచి 40 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 30.63 కోట్లతో భారీ ఏర్పాట్లు చేపట్టింది.

భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

పుష్కర ప్రాంతంలో భద్రత కోసం 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 100 మంది గజ ఈతగాళ్లను నియమించడంతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, సేఫ్టీ బోట్లను మోహరించారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రత్యేక హారతి, తెప్పోత్సవాలకు కూడా భారీ ఏర్పాట్లు చేశారు. అదనంగా రూ. 1.20 కోట్లతో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేయగా, నాగేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేశారు. మీడియా సెంటర్ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

భక్తుల కోసం ప్రత్యేక సదుపాయాలు
- 23 ప్రాంతాల్లో భారీ పార్కింగ్ సదుపాయాలు
-245 ఎకరాల్లో 1.70 లక్షల వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు
- 90 షటిల్ బస్సులతో రవాణా సదుపాయం
- ఘాట్ల వద్ద చలువ పందిళ్లు, కాయిర్ మ్యాట్లు అందుబాటులో
-తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు
- 500 ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటు
-300 మంది వైద్య సిబ్బందితో మెడికల్ క్యాంపులు
-అన్ని ప్రధాన ప్రాంతాల్లో అంబులెన్సులు సిద్ధం

## సూర్యాస్త్ర ప్రయోగం సక్సెస్

మొదటి తరువాయి

లక్ష్యానికి గురిచూసి..

ఈ ప్రయోగంలో రెండు వెర్షన్లను పరీక్షించగా అత్యుత్తమ ఫలితాలు వచ్చాయి. 150 కిలోమీటర్ల రేంజ్ రాకెట్ నిర్దేశిత లక్ష్యానికి 1.5 మీటర్ల దూరంలో, 300 కిలోమీటర్ల రేంజ్ రాకెట్ లక్ష్యానికి కేవలం 2 మీటర్ల దూరంలో తాకి అద్భుత కచ్చితత్వాన్ని నమోదు చేశాయి. ఈ అమోఘమైన సామర్థ్యంతో ఈ రాకెట్ వ్యవస్థలను భారత సైన్యం కోసం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

శత్రు స్థావరాలే టార్గెట్

సాంప్రదాయ ఫిరంగి గుండ్లలా కాకుండా అత్యాధునిక సాంకేతికతతో పనిచేసే ఈ గైడెడ్ రాకెట్లు శత్రువుల కమాండ్ సెంటర్లు, రాడార్ సైట్లు, రవాణా సదుపాయాలను ధ్వంసం చేయడానికి ఉపయోగపడతాయి. 150 కి.మీ రాకెట్‌ను ఆర్మీ నేరుగా యుద్ధరంగంలో మోహరించవచ్చు. మరింత శక్తివంతమైన 300 కి.మీ రాకెట్ శత్రు భూభాగంలోని లోతట్టు వ్యూహాత్మక స్థావరాలను తుత్తునియలు చేయగలదు.

ఆర్థిక వ్యవస్థకూ ఊతం

దేశీయ ప్రైవేట్ సంస్థలు రాకెట్లు, డ్రోన్ల తయారీలోకి రావడం వల్ల రక్షణ రంగంలో విదేశీ దిగుమతుల భారం తగ్గుతుంది. ఇది సైన్యాన్ని స్వయంసమృద్ధం చేయడమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఎంతగానో దోహదపడనుంది.

## జమిలి ఎన్నికలతో రూ.7 లక్షల కోట్ల ఆదా

మొదటి తరువాయి



గాంధీనగర్, మే 20

లోక్‌సభ, అసెంబ్లీలు, స్థానిక సంస్థల ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించడం వల్ల దాదాపు రూ.7 లక్షల కోట్లు ఆదా అవుతాయని, పాలనా సామర్థ్యంమెరుగుపడడంతోపాటు దేశ జీడీపీ వృద్ధి 1.6 శాతం వరకు పెరుగుతుందని జమిలి ఎన్నికలపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) తెలిపింది. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో విలేకరుల సమావేశంలో జేపీసీ చైర్‌పర్సన్, లోక్‌సభ ఎంపీ పీపీ చౌదరి మాట్లాడుతూ ఏకకాల ఎన్నికల ప్రతిపాదనను అధ్యయనం చేసేందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో 8 మంది సభ్యుల కమిటీని ప్రధాని నరేంద్ర మోదీ నియమించారని తెలిపారు.

# ఇన్వెస్ట్ తెలంగాణ

మొదటి తరువాయి

పరిశ్రమల ఏర్పాటుపై బుధవారం నాడిక్కడి మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలోని బోధి పెవిలియన్‌లో సమీక్ష? సమావేశం నిర్వహించారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి , తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) వైస్ చైర్మెన్ శశాంక్, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ జూన్ లో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్ లో పరిశ్రమల ఏర్పాటు కు శంకుస్థాపన జరిగేలా చూడాలని చెప్పారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలని సూచించారు. నెట్ జీరో సిటీ తరహా లోనే డిజైన్లు ఉండాలనీ, అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతుల కల్పన ఉండాలని చెప్పారు. దీనిలో ఎలాంటి రాజీ పడొద్దని అధికారుల్ని హెచ్చరించారు. దీనికోసం అవసరమైతే అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలన్నారు. ఫ్యూచర్ సిటీలోకి అంతర్జాతీయ స్థాయి సంస్థలను తీసుకురావాలనీ,




దీనికోసం పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపాలని చెప్పారు. అయితే ఫ్యూచర్‌సిటీలో తొలుత ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయాలనీ, ఆ తర్వాతే భూ కేటాయింపులు చేయాలని సూచించారు. 1,500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలనీ, వాటి నీటి అవసరాలకోసం సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను (ఎస్టీపీ)లు వినియోగించు కోవాలని చెప్పారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్ ను ఫ్యూచర్ సిటీ కి వచ్చేలా చర్య లు తీసుకోవాలనీ, దీనికోసం అవసరమైతే ప్రధాని మోడీని కలిసి హెల్త్ క్లస్టర్ కోసం ప్రత్యేక విజ్ఞప్తి చేద్దామని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఫ్యూచర్ సిటీలోనే ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించాలని ఆదేశించారు. అలాగే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ), డేటా సెంటర్ల కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలోని ప్రభుత్వ భూముల్ని గుర్తించాలని ఆదేశించారు. ఈ కేంద్రాలు సాధ్యమైనం తగా ద్వితీయ శ్రేణి నగరాలల్లో ఏర్పాటయ్యేలా విధాన రూపకల్పన చేయాలని చెప్పారు. అలాగే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మూడు నెలల్లో టీ ఫైబర్ కు కనెక్ట్ కావాల్సిందేననీ, దీనిలో ఎవరికీ ఎలాంటి మినహాయింపులు ఉండబోవని స్పష్టంచేశారు. హైదరాబాద్ పురోగతిని మార్చే బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. అంతకుముందు పరిశ్రమల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక పురోగతి, ఫ్యూచర్ సిటీ ప్రాధాన్యతలను వివరించారు.

# నా శవంపై కాషాయ జెండా కప్పాల్సిందే

మొదటి తరువాయి

వస్తున్నారని సమాచారం అందుకున్న కార్యకర్తలు భారీ ఎత్తున పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. బీజేపీ జిందాబాద్, మోదీ జిందాబాద్, బండి సంజయ్ జిందాబాద్, రామచంద్రరావు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. సంజయ్ ఆప్ సంఘుర్ష్ కరో... హమ్ తుమ్హారే సాత్ హై అంటూ నినాదించారు. అనంతరం బండి సంజయ్ ను కలిసి సంఘీభావం ప్రకటిస్తూ పెద్ద ఎత్తున సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. దాదాపు 2 గంటలపాటు పార్టీ కార్యకర్తలతో గడిపిన బండి సంజయ్ అనంతరం బీజేపీ ఎమ్మెల్సీ రాకేశ్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ సీనియర్ నేతలు డాక్టర్ మనోహర్ రెడ్డి, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ తదితరులతో కలిసి మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. మీరు కొత్త పార్టీ పెట్టబోతున్నారని కూడా వార్తలొస్తున్నాయి కదా అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ బండి సంజయ్ అంటే ఏమిటో మీకు తెలుసు. రాష్ట్ర ప్రజలకు తెలుసు. కార్యకర్తలందరికీ తెలుసు. ఫాల్తుగాళ్ల చేసే ప్రచారానికి స్పందించాల్సిన అవసరమే లేదు. బీజేపీ అంతర్గత శిక్షణా శిబిరాల్లో ఎంతో మంది కార్యకర్తలను తయారు చేసిన వ్యక్తులం మేము. ఎవరికైనా ఉరి తీయబోయే ముందు చివరి కోరిక అడుగుతారు. బీజేపీలో కమిట్ మెంట్ ఉన్న కార్యకర్తలను ఇదే విషయాన్ని అడిగితే చెప్పేది ఒక్కటే "నేను చచ్చిపోయాక నా శవంపై కాషాయ జెండా కప్పాలని అడుగుతారు. నాది అదే చివరి కోరిక కూడా



అని అన్నారు. మిమ్మల్ని కేబినెట్ నుండి బర్తరఫ్ చేయబోతున్నారని కొన్ని టీవీలు, డిజిటల్ మీడియాలో వార్తలొస్తున్నాయి కదా అన్న ప్రశ్నకు జవాబు ఇస్తూ తెలంగాణలో బీఆర్ఎస్ కు 17 ఎంపీ సీట్లున్నాయి కదా? ఆయన భాగస్వామ్యంతోనే కేంద్రంలోని ఎన్డీఏ నడుస్తోంది కదా? బహుశా నన్ను బర్త్ రఫ్ చేయాలనే నిర్ణయం కేసీఆర్, ఆయన కొడుకే తీసుకుంటుట్లున్నారు. ఇంకా ఏమో చేయబోతున్నారే వాళ్లనే అడగండి(కేఆర్, కేటీఆర్ లను ఎద్దేవా చేస్తూ వేసిన సెటైర్) వేశారు. మిమ్మల్ని త్వరలోనే అరెస్ట్ చేయబోతున్నారనే వార్తలు కూడా వస్తున్నాయి కదా అనే ప్రశ్నకు జవాబు ఇస్తూ కేసీఆర్ కొడుకు విసిరే చిల్లర మెతుకులకు ఆశపడి ఒకట్రెండు ఛానళ్లు ఇట్లాంటి కథలను ప్రసారం చేస్తున్నాయి. అది చూసి కేసీఆర్ కొడుకు రాక్షసానందం పొందుతున్నాడు. వాళ్ల దృష్టితో చూస్తే నన్ను అరెస్ట్ చేయాల్సిందేమో. ఎందుకంటే... 10 ఏళ్ల బీఆర్ఎస్ గడీల పాలనను బద్దలు కొట్టినం కదా? పదేళ్ల కేసీఆర్ కుటుంబ అవినీతి అరాచక పాలనను బొందపెట్టినం కదా? అధికారం పోయిందనే కోపం వాళ్లుంటుంది కదా? అందుకే నన్ను అరెస్ట్ చేయించాలని చూస్తున్నారేమో అని అన్నారు. బండి భగీరథ్ విషయంలో మీరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరెస్ట్ కాకుండా జాప్యం చేశారనే ఆరోపణలున్నాయి కదా అనే ప్రశ్నకు జవాబు ఇస్తూ కోర్టు పరిధిలో ఉంది. కానీ ఒక్క విషయం గుర్తుంచుకోండి. కన్న కొడుకును ఒక తండ్రి నేరుగా పోలీసులకు అప్పగించిన సందర్భం ఉందా? కానీ నేను విచారణ జరపాలని పోలీసులు కోరితే... నేనే మా అబ్బాయిని పోలీసు విచారణ కోసం అప్పగించా. నేను ప్రజల మధ్య ఉన్నాను కాబట్టే, ప్రజలు బీజేపీతో ఉన్నారు కాబట్టే నన్ను, నా పార్టీని బదనాం చేసేందుకు కేసీఆర్ కొడుకు సోషల్ మీడియాలో ఫేక్ మీడియా ఫ్యాక్టరీ ద్వారా నాపైన ఇట్లాంటి విష ప్రచారం చేయిస్తున్నాడు. ఎన్ని వండి వార్చినా జనం బీజేపీతోనే ఉన్నారు. ఫేక్ వార్తలను, ఫేక్ స్టోరీలను చూసి జనం నవ్వుకుంటున్నారు.

# జనగణనలోనే కులగణన

మొదటి తరువాయి

ఉందని సర్వోన్నత న్యాయస్థానంలో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీ, జస్టిస్ విపు పంచోలీతో కూడిన ధర్మాసనం పిల్ ను కొట్టివేసింది. జనగణన కులాల ఆధారంగా జరగాలా వద్దా అన్నది పూర్తిగా ప్రభుత్వ విధాన నిర్ణయమని ఈ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. సంక్షేమ చర్యల కోసం ఎంత మంది వెనుకబడిన వర్గాల్లో ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాలని తెలిపింది. ఈ అంశంలో న్యాయస్థానం జోక్యం చేసుకునే అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇది పూర్తిగా విధానపరమైన అంశమని, జోక్యం చేసుకునే కారణం కనిపించడం లేదంటూ చెప్పింది. 2027 జనగణనలో కులగణన తప్పనిసరిగా ఉండాలా వద్దా అన్నది కోర్టు నిర్ణయించే అంశం కాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల నిర్మాణం, వారి సంఖ్య వంటి అంశాలను అంచనా వేయడానికి ప్రభుత్వానికి ఈ సమాచారం అవసరం కావచ్చుని ధర్మాసనం అభిప్రాయ పడింది. ఈ అంశం పూర్తిగా ప్రభుత్వ విధాన పరమైనదని, ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయ సమీక్ష పరిధిలోకి రాదని పేర్కొంటూ ధర్మాసనం ఈ పిటిషన్ ను తిరస్కరించింది.

**పిటిషనర్ వాదన ఇదే :** ఈ పిల్ ను సుధాకర్ గుమ్ముల అనే వ్యక్తి దాఖలు చేశారు. కుల ఆధారిత డేటా సేకరణను రాజకీయ నాయకులు, కార్పొరేట్ సంస్థలు దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. ఇంత భారీ స్థాయిలో కుల డేటా సేకరణకు సరైన కారణం లేదని కోర్టుకు తెలిపారు.

**తొలిసారిగా డిజిటల్ గణన :** మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక జరుగుతున్న 16 వ జనగణన ఇది. 2027 జనగణన నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 11,718 కోట్లను వెచ్చించనుంది. ఈసారి జనగణనలో భాగంగానే కులగణన కూడా చేయనున్నారు. దీన్ని రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి దశలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు విడతలవారీగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో (యూటీలు) గృహ గణన జరుగుతుంది. రాష్ట్రాలు, యూటీలు తమ సౌలభ్యాన్ని బట్టి గరిష్ఠంగా 30 రోజులు కూడా ఈ ప్రక్రియను నిర్వహించుకోవచ్చు. 33 ప్రశ్నల ఆధారంగా వివరాలు నమోదు చేస్తారు. రెండో విడతలో పూర్తిగా జనాభా లెక్కల సేకరణ చేపట్టనున్నారు. ఇది 2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1 వరకు జరుగుతుంది. అయితే మంచుతో కూడిన లద్దాఖ్, జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని ప్రతికూల వాతావరణ ప్రాంతాల్లో 2026 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ 1 వరకు జనగణన చేపట్టనున్నారు. అయితే ఈసారి జనగణనతో పాటే తొలిసారిగా కులగణన కూడా నిర్వహిస్తామని ప్రభుత్వం తెలిపింది.

# మెలోనికి మెలోడీ..

మొదటి తరువాయి



ఆర్థిక సంక్షోభంలో టాఫీలు పంచుతున్నారు..

దేశంలోని సామాన్య పౌరుడు ఎదుర్కొంటున్న కఠిన ఆర్థిక వాస్తవాలను మోదీ ప్రభుత్వం విస్మరిస్తున్నదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. 'మన తలపైన ఆర్థిక తుఫాన్ ముంచుకు వస్తుంటే మోదీ మాత్రం ఇటలీలో టాఫీలు పంచుతున్నారు. రైతులు, యువత, శ్రామికులు ఆర్థిక కష్టాలతో రోదిస్తున్నారు. ప్రధాని మాత్రం నవ్వుతూ రీల్స్ చేస్తుంటే బీజేపీ సభ్యులు చప్పట్లు కొడుతున్నారు. ఇది నాటకీయ జిమ్మిక్కు' అని విమర్శించారు.

## ఆసిఫాబాద్ లో ఇందిరమ్మ పండుగకు రాష్ట్ర ముఖ్యమంత్రి రాక

మొదటి తరువాయి

రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అనేక మంది లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించడం జరిగిందని, ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. జూన్ 2వ తేదీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఇందిరమ్మ నిర్మాణం పండుగ ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొననున్నారని తెలిపారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి జిల్లాలోని 3 గ్రామాలను పరిశీలిస్తారని తెలిపారు. జిల్లాలోని కొకారి గ్రామంలో గిరిజన బిడ్డలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిందని, ఆదివాసీల ఇండ్ల కష్టాలు తొలగించిందని తెలిపారు. ప్రభుత్వం మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి, రేషన్ కార్డులు, ఇందిరా మహిళా శక్తి, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి అనేక పథకాలను ప్రవేశపెట్టి మహిళను ఇంటి పెద్దగా గుర్తించి సంక్షేమ ఫలాలను అందిస్తుందని తెలిపారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, విద్య సంస్థలను బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తూ ప్రజలకు అందుబాటులో స్థానికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించడంతో పాటు, మరింత వేగవంతమైన, మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వ వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలల ద్వారా వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంపొందించి ప్రజలకు మరింత చేరువలో వైద్యాన్ని ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం 2వ విడతలో అర్హులైన ప్రతి నిరుపేదకు ఇండ్లు మంజూరు చేస్తామని, ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో 2026-28 సంవత్సరానికి గాను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# వెంటాడిన ప్రశ్నలు



నూట నలభై ఐదు కోట్ల మంది ప్రజలకు ప్రతినిధిగా వెళ్లాడు. యాభై ఆరించుల ఛాతీతో వెళ్లాడు. మూడోసారి ప్రధానమంత్రిగా ఎన్నుకోబడి మరీ వెళ్లాడు. కానీ ఒకే ఒక్క ప్రశ్నకు సమాధానం చెప్పలేక పలాయనం చిత్తగించాడు. అంతర్జాతీయంగా ఇప్పటికే, విదేశాంగ విధానం తలకిందులవుతున్న దశలో, ఇప్పుడు మరింత దిగజారిపోయింది. నార్వే దేశానికి చెందిన 'డాగ్‌సా విసెస్' పత్రికలో పనిచేస్తున్న జర్నలిస్టు హెల్లీ లింగ్ ఒక ప్రశ్నను సంధించారు. పత్రికా స్వేచ్ఛలో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉన్న నార్వేలో ఒక జర్నలిస్టు వేసే ప్రశ్నకు ఎందుకు సమాధానం ఇవ్వడం లేదు. భారతదేశంలో మానవ హక్కులు, మైనారిటీ హక్కులు, పత్రికా స్వేచ్ఛలపై ఆమె ప్రశ్నలు వేస్తున్నప్పుడు అతివేగంగా మన బాహుబలుడు వెళ్లిపోవడం చూస్తే ప్రశ్నలు ఎంత బలమైనసత్యంతో కూడుకున్నవో అవగతమౌతుంది. అసలు మన నాయకుడికి గత పన్నెండేళ్ల నుండి దేశంలో పత్రికా సమావేశాన్ని పెట్టలేదనే విషయం పాపం వాళ్లకేమి తెలుసు! ప్రశ్నలు ఎదుర్కోవడానికి నిజాయితీ ఉండాలి. ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉండాలి.

సరే.. ప్రధానిగారు తీవ్ర పనులతో ప్రశ్నలను తీసుకునే అవకాశం కుదరలేదని అనుకుందాం. అలా, ఆ తర్వాత విదేశీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి సిబి జార్జ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. అతనికి జర్నలిస్టు ప్రశ్నలు వేసింది. భారతదేశంలో ప్రాథమిక హక్కులు నిరాకరించబడుతున్నవేళ, నార్వే మీ దేశాన్ని ఎట్లా విశ్వసిస్తుంది? అన్నది ఆమె ప్రశ్న అయితే, సిబి జార్జ్ కూడా మన వాట్సప్ యూనివర్సిటీ వండి వడ్డించే సమాధానాలే చెప్పాడు. మాకు కొన్ని వేల సంవత్స రాల ప్రాచీన చరిత్ర ఉంది. మా రాజ్యాంగం అందరికీ ప్రాథమిక హక్కులు గ్యారంటీ చేసిందన్నాడు. మరెందుకు హక్కులు నిరాకరించ బడుతున్నాయంటే? హక్కులు నిరాకరిస్తే, ప్రజలు న్యాయస్థానాలను ఆశ్రయించగలరు అని సెలవిచ్చారు. అసలు ప్రజలు గ్యారంటీ చేయబడిన హక్కుల కోసం కోర్టులకు పోవాల్సిన పరిస్థితులు ఎందుకు వస్తున్నాయని ఆ జర్నలిస్టు తిరిగి ప్రశ్నిస్తే, ఇది నేను పెట్టిన పత్రికా సమావేశం. నేనే నిర్ణయిస్తాను. అంటూ ప్రశ్నలను దాటవేసి, కొనసా గించారు. దీన్నిబట్టి మనకు అర్థమయ్యే విషయమేమంటే కింది నుంచి పై వరకు మన వాళ్లంతా ప్రశ్నల నుండి తప్పుకునేవాళ్లేనని తెలుస్తున్నది. అందుకే మనదేశం పత్రికా స్వేచ్ఛలో 157వ స్థానంలో, బంగ్లాదేశ్, పాకిస్తాన్ కంటే దిగువన ఉంది. ప్రథమ స్థానంలో ఉన్న నార్వే పత్రికల ప్రశ్నలకు జవాబు లెట్లా ఇవ్వగలరు! ఆ ప్రశ్నలు వేసిన వ్యక్తి లింగ్ పొరపాటున ఇండియాలో ఉండి ఉంటే అరెస్ట్ చేయటమో! ఈడి, సి.బి.ఐ రైడ్ చేయడమో, ఆమె ఇంటిని బుల్డోజ్ చేయడమో చేసేవారు. నార్వే కాబట్టి బతికిపోయింది. ఇక మన దేశంలోని మోడీ భక్త ఛానెళ్లు, అమ్ముడుపోయిన ఛానెళ్లు ఈ సంఘటనతో తెగ బాధపడి పోతున్నాయి. అంతేకాదు, ఆ జర్నలిస్టుపై లేనిపోని ఆరోపణలకూ, చైనా ఏజెంట్ అని నిందలు వేయటం మొదలేశారు. ట్రోలింగ్‌కూ పాల్పడుతున్నారు. కానీ, నేను జర్నలిస్టుని, ప్రశ్నలడగటమే నా పని, సమాధానాలు రాబట్టటం కోసం ఎన్ని ప్రశ్నలయినా అడుగుతాను. వాళ్లు విసుక్కున్నా సరే! అని ఆమె చెప్పటం మన వాళ్లకు పాఠం ఎప్పుడు అవుతుందో! ఉమర్ ఖాలిద్ అనే విద్యార్థి, ఉద్యమ కారుడిని ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయకుండా ఐదు సంవత్సరాలుగా నిర్బంధించి, ఉపా చట్టాన్ని మోపారు. ప్రభుత్వానికి గానీ, నాయకులకు గానీ వ్యతిరేక అభిప్రాయాలను వెల్లడిస్తే అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసి, నిర్బంధానికి పూనుకుంటున్నారు. సాయిబాబా, వరవరరావు, స్టాన్ స్వామి ఇంకా వందలాది మంది ప్రాథమిక హక్కులు నిరాకరించబడు తూనే ఉన్నాయి. ఇక నేను హిందువుల కోసమే పనిచేస్తానని ఇటీవల బెంగాల్ ముఖ్యమంత్రి ప్రకటించడం, ముస్లింలు పారిపోయేట్లు చేస్తామని అనడం ఎంత దారుణం. దీన్ని ప్రజాస్వామ్యం అని ఎలా అనగలం? కాబట్టి నార్వే జర్నలిస్టు వేసిన ప్రశ్న చాలా చాలా అవసరమైన ప్రశ్న. మన ప్రధానిగారు నార్వే పర్యటనకు ఎందుకు వెళ్లారు? మనదేశం 43 ఏండ్ల తర్వాత మళ్లీ మన మోడీ గారే వెళ్లారు. దీని అసలు లక్ష్యాలు వేరుగా ఉన్నాయని కథనాలు వస్తున్నాయి. 'నార్వేస్ సావరెన్ వెల్ఫేర్ ఫండ్' అనేది పెద్ద మొత్తంలో వాటాలు కలిగిన ఒక నిధి. ఇందులో అనేక సంస్థలలో వాటాలు కలిగి ఉంటుంది.ఆ సంస్థ, మన అదానీ గారి కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో ఫిబ్రవరిలోనే పెట్టింది. ఇక దానికి అవకాశం లేదు. ఆ వ్యవహారాన్ని చక్కదిద్దటం కోసం అదాని తరపున ప్రధాని మోడీ వెళ్లాడని కథనాంశం. అంతకంటే పెద్ద ప్రయోజకత్వం మన పెద్దాయనకు ఏముంటది! ఏది ఏమైనా ప్రశ్నలు మాత్రం వెంటాడుతూనే ఉంటాయి. రేపు మన దేశంలోనూ ప్రశ్నలు మొలకెత్తుతాయి!పెద్ద మొత్తంలో వాటాలు కలిగిన ఒక నిధి. ఇందులో అనేక సంస్థలలో వాటాలు కలిగి ఉంటుంది. మన అదానీ గారి కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో ఆ సంస్థ ఫిబ్రవరిలో పెట్టింది. ఇక దానికి అవకాశం లేదు. ఆ వ్యవహారాన్ని చక్కదిద్దటం కోసం అదాని తరపున ప్రధాని మోడీ వెళ్లాడని కథనాంశం. అంతకంటే పెద్ద ప్రయోజకత్వం మన పెద్దాయనకు ఏముంటది! ఏది ఏమైనా ప్రశ్నలు మాత్రం వెంటాడుతూనే ఉంటాయి.

# బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ప్రముఖ ప్రైవేట్ పాఠశాలల్లో దళిత విద్యార్థులకు సీట్లు కేటాయించాలి

### కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున



**నల్లగొండ, మే 20 ( మహాప్రభ )**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కీం (బెస్ట్ అవైలబుల్ స్కీమ్) క్రింద దళిత విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వమే పూర్తి వ్యయభారం భరించి నల్లగొండ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాబోధన నిర్వహిస్తున్నదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున పేర్కొన్నారు. ఈరోజు నల్లగొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ గారికి కులవేక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించడం జరిగింది ఈ పథకం ద్వారా పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం లభిస్తున్నప్పటికీ ప్రస్తుతం కొన్ని పరిమిత ప్రైవేట్ పాఠశాలలకే దీూూ స్కీం పరిమితం కావడం వల్ల అనేక మంది దళిత విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సెయింట్ ఆల్ఫోన్సస్, లిటిల్ ఫ్లవర్ వంటి ప్రముఖ పాఠశాలల్లో దీూూ స్కీం కింద సీట్లు కేటాయించేవారని గుర్తుచేశారు.ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం అన్ని రకాల అనుమతులు, సౌకర్యాలు కల్పిస్తున్న నేపథ్యంలో పేద దళిత, గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకొని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలను ఒప్పించి దీూూ స్కీం కింద ఎక్కువ సంఖ్యలో సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నల్లగొండ పట్టణంలోని క్రింది ప్రముఖ విద్యాసంస్థల్లో దీూూ స్కీం అమలు చేయాలని కోరారు:

1. ఎస్పిఆర్ స్కూల్
2. ఎంవిఆర్ స్కూల్
3. ఏకలవ్య స్కూల్
4. సెయింట్ ఆల్ఫోన్సస్ స్కూల్
5. లిటిల్ ఫ్లవర్ స్కూల్
6. నారాయణ స్కూల్
7. శ్రీ చైతన్య స్కూల్
8. గౌతమ్ మోడల్ స్కూల్
9. వేదాంత స్కూల్
10. గీతం మోడల్ స్కూల్
11. మూర్తి స్కూల్
12. స్రవంతి స్కూల్
13. విపస్య స్కూల్
14. ఓక్ ట్రీ స్కూల్

దళిత విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని సంబంధిత పాఠశాల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి దీూూ స్కీం కింద తగిన సంఖ్యలో సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రెమిడాల పరుష రాములు, జిల్లా సహాయ కార్యదర్శి గాదె నరసింహ, బొల్లు రవీందర్ ,జిల్లా నాయకులు మాతంగి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు





**నందికొట్కూరు, మే 20 ( మహాప్రభ )**
ఉమ్మడి కర్నూల్ జిల్లా అధ్యక్షుడు శేఖర్ చౌదరి ఆదేశాల మేరకు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు.శాంతి థియేటర్ వద్ద అభిమానుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. "జై ఎన్టీఆర్" నినాదాలతో పట్టణం మార్మోగింది.ఈ వేడుకలను నందికొట్కూరు ఎన్టీఆర్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కాజా, అబ్దుల్లా, మన్సూర్, లడ్డు, భాష, ఫైజుల్లా, సుభాన్, ఇలియాస్, మధు, హుస్సేన్ బాషా, అశోక్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు సదుపాయాలపై సమీక్ష





**శ్రీశైలం, మే 20 ( మహాప్రభ )**
శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారి దేవస్థానంలో భక్తుల సౌకర్యాల కల్పనపై కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ దర్శనం, మంచినీటి సదుపాయం, అన్నప్రసాదం, శౌచాలయాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులపై 90 శాతం సానుకూల స్పందన రావాలి. విధులలో ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం ఉండకూడదు" అని స్పష్టం చేశారు.వేసవికాలం దృష్ట్యా ప్రధాన కూడళ్లలో ఉచిత చలివేంద్రాలు ఏర్పాటు చేసి, భక్తులకు మంచినీరు, మజ్జిగ అందిస్తున్నామని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో మట్టికుండలు, క్యూలైన్లలో నిరంతర నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అన్నప్రసాద భవనంలో శుచీశుభ్రత, తాజా కూరగాయల వినియోగం, రుచికరమైన వంటకాలు, ఆత్మీయ వడ్డనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి హాలులో వడ్డన సజావుగా జరిగేలా పర్యవేక్షణ ఉండాలని అన్నారు.పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా ఉండి, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలను ఆలయ ప్రసార వ్యవస్థ ద్వారా భక్తులకు తెలియజేయాలని ఆయన ఆదేశించారు.

## మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్ కలిసిన పోలీస్ కృష్ణ



**టేక్మాల్ ప్రతినిధి మే 20 ( మహాప్రభ )**
మెదక్ జిల్లా జెయింట్ కలెక్టర్ నాగేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి తమ తీపి గుర్తులు గుర్తుచేస్తూ రాజకీయ ఎంట్రీ గురించి తెలియజేశారు పేదలకు తన వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని పోలీస్ కృష్ణ అంటే పేదలకు అండగా ఉంటాడని అన్నా అంటే వెంటనే స్పందిస్తాడని పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోలీస్ కృష్ణ తెలిపారు,

## దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్



**మహబూబాబాద్,మే 20 ( మహాప్రభ )**
ఆన్‌లైన్ ఫార్మాసీల అక్రమ విక్రయాలు, చైన్ ఫార్మాసీలు ఇస్తున్న అధిక డిస్కౌంట్లను నిరసిస్తూ అఖిల భారత ఔషధ వ్యాపారుల సంఘం పిలుపు మేరకు దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్ జరిగాయి.జిల్లా కేంద్రంలో మెడికల్ షాప్ యజమానులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడు సంపత్ రావు మాట్లాడుతూ, "ఆన్‌లైన్ విక్రయాలు, కార్పొరేట్ డిస్కౌంట్ల వల్ల రిటైల్, హోల్‌సేల్ కెమిస్టులు తీవ్ర నష్టపోతున్నారు. దశాబ్దాలుగా సేవలందిస్తున్న మెడికల్ షాపుల మనుగడ ప్రశ్నార్థకమైంది. జీ.ఓ. 220 రద్దు చేసి, జీ.ఓ. 817 సవరించి ఆన్‌లైన్ ఫార్మసీలను నియంత్రించాలి" అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోమా పురుషోత్తం, కోశాధికారి రాజు, రవి, రంగారెడ్డి, రామకృష్ణ, మురళి, మధు, సతీష్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గౌరవ్ టూరిస్ట్ రైలు -- ప్రత్యేక యాత్రలు



**మహబూబాబాద్, మే 20 ( మహాప్రభ )**
భక్తులకు ఆధ్యాత్మిక యాత్రను మరింత సౌకర్యవంతంగా అందించేందుకు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌టీసీ) భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును హైదరాబాద్ నుంచి మూడు ప్రత్యేక ప్యాకేజీలతో ప్రారంభిస్తోంది.మే 24న మొదలయ్యే యాత్ర తిరువన్నమలై, రామేశ్వరం, కన్యాకుమారి, తంజావూరు, చిదంబరం వరకు కొనసాగి మే 31న ముగుస్తుంది. సాధారణ టికెట్ ధర రూ.14,500, 3-ఏసీ రూ.21,700, 2-ఏసీ రూ.27,900గా నిర్ణయించారు.జూన్ 16న ప్రారంభమయ్యే సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్రలో మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, ద్వారక, సోమనాథ్, భీమాశంకర్, త్రయంబకేశ్వర్, గృశ్నేశ్వర్ ఆలయాలను దర్శించే అవకాశం కల్పిస్తారు. ఈ యాత్ర జూన్ 26న ముగుస్తుంది. టికెట్ ధరలు సాధారణ రూ.17,600, 3-ఏసీ రూ.26,700, 2-ఏసీ రూ.34,600.జూలై 4న ప్రారంభమయ్యే బైద్యనాథ్ ధామ్--అయోధ్య--కాశీ పుణ్యక్షేత్ర యాత్ర జూలై 13 వరకు కొనసాగుతుంది. ఈ యాత్రలో పూరి, కొనార్క్, బైద్యనాథ్ ధామ్, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్ దర్శనాలు ఉంటాయి. టికెట్ ధరలు సాధారణ రూ.16,400, 3-ఏసీ రూ.25,500, 2-ఏసీ రూ.33,100.యాత్రికులకు హోటల్ బస, శాఖాహార భోజనం, స్థానిక రవాణా, ట్రావెల్ ఇన్సూరెన్స్, టూర్ మేనేజర్ సహాయం వంటి సదుపాయాలు ప్యాకేజీలో భాగంగా అందిస్తారని ఐఆర్‌టీసీ మేనేజర్ పీ.వి. వెంకటేష్ తెలిపారు.

## జర్నలిస్టులకు టోపీలు పంపిణీ



**నందికొట్కూరు, మే 20 ( మహాప్రభ )**
నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో ఆల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఎమ్మెల్యే గిత్త జయసూర్య టోపీలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "జర్నలిస్టులు ఎండ, వాన లెక్కచేయకుండా సమాచారాన్ని సేకరించడానికి కష్టపడుతున్నారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అవసరం. జర్నలిస్టుల కోసం టోపీలు పంపిణీ చేయడం హర్షణీయమైన విషయం" అని అన్నారు.జిల్లా అధ్యక్షుడు బి. ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, "ప్రతి వేసవిలో జర్నలిస్టుల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని టోపీలు పంపిణీ చేయడం మా వంతు సహాయం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రామాంజనేయులు, జయరాజు, గోపి, నాగరాజు, ఇమ్మాన్ రాజు, జమ్ములయ్య, రహంతుల్లా, పగడం నాగరాజు, శేషన్న, పరమేష్, ఉసెనాలం, హరి తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆర్డీవోకు ఘన సన్మానం

-సామాజికవేత్త : శ్రీనివాస్ గౌడ్




**దేవరకొండ మే 20 ( మహాప్రభ )**
జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన ఆర్డీవో గా విచ్చేసిన పి పద్మ ప్రియ మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించి,మెమెంటుఅందించి శుభాకాంక్షలు తెలిపారు. మీరు మా ప్రాంతానికి రావడం ఎంతో ఆనందకరమని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలో మారుమూల ప్రాంతంమైనటువంటి ఈ ప్రాంతానికి సేవ చేయడం వెనుకబడిన వర్గాలను అభివృద్ధిలోకి తీసుకురావడం ఎంత అవసరమని ఈ ప్రాంతంలో బీసీ, ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ వర్గాలు ఎక్కువగా ఉన్నారని ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ మెరుగైనటువంటి సేవలు చేయాలనికోరారు. మా సంఘం యొక్క మద్దతు సహాయ సహకారాలు సంపూర్ణంగా ఉంటాయని తెలిపారు. ఈకార్యక్రమంలో సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, రెడ్డి కోటేశ్వరరావు, లౌడియ భాషనాయక్,గరిడి విజయభాస్కర్,బచ్చనబోయిన శివ, టి మల్లేష్,ఎండ్. ఖలీక్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ షాపుల బంద్ విజయవంతం






**దేవరకొండ డివిజన్ మే 20 ( మహాప్రభ )**
నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో మెడికల్ షాపుల బంద్ ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. 'ది ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్' జాతీయ సంస్థ పిలుపులో భాగంగా... 'ది తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్' మరియు స్థానిక 'దేవరకొండ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్' ఆధ్వర్యంలో ఈ బంద్‌ను నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపుల యజమానులు స్వచ్ఛందంగా షాపులను మూసివేసి నిరసన తెలిపారు. అయితే, అత్యవసర సమయాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని, ప్రజలు కూడా తమ నిరసనకు సహకరించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. అత్యవసరం పరిస్థితులలో మెడిసిన్ ( మందులు) అమ్మేందుకు గార్లపాటి జగతయ్య మెడికల్ హాల్ అందుబాటులో ఉంచినట్లు యూనియన్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌరవ అద్యక్షులు గార్లపాటి జగతమ్య, అద్యక్షులు" గుంటోజు చంద్రశేఖర్ కార్యదర్శి – బాల గణేష్, కోషదికారి: పొట్ట బత్తుల శేఖర్,తదితరుల కార్యసద్యులు,తదితర కెమిస్ట్ సోదరులు రియాజ్, శ్రవణ్, రియాండ్, నాగరాజు, మారం మల్లయ్య , కృష్ణ ( అపోలో ),( మెడిప్లస్ ) ప్రశాంత్, బాబా, తదితరులు ఉన్నారు.

# తాడ్వాయిలో ఈజీఎస్ పనుల పరిశీలన




**తాడ్వాయి, మే 20 (మహాప్రభ)**
తాడ్వాయి గ్రామంలో బుధవారం జిల్లా పరిషత్ సీఈఓ, చందర్ నాయక్,ఈజీఎస్ పనులను పరిశీలించారు. వర్క్‌సైట్‌ను సందర్శించి, కార్మికులతో మాట్లాడి పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తర్వాత మండలంలోని అధికారులతో సమావేశమై రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి అధికారి సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని సూచిస్తూ సభ్యత్వ నమోదు చేపట్టించారు. కార్యక్రమంలో మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్.

మెదక్ ఆర్డీవో రమాదేవి.



**మెదక్ జిల్లా -20మే (మహాప్రభ )**
ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ పై సమావేశం ఆర్డీవో కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు, పారదర్శకతతో పని చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను జూన్ 24 నుంచి జులై 25 వరకు చేపట్టనున్నారన్నారు. ఈ సమయంలో బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహించి, ఎన్యూమరేషన్ ఫారాల ద్వారా వివరాలు సేకరిస్తారన్నారు. ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ ఎవరో తెలిసేలా, వారి పేరు, మొబైల్ నంబర్, పోలింగ్ కేంద్రం వివరాల గురించి చర్యలు తీసుకోవాలని, విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి, తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి, రికార్డులను నవీకరించాలని తెలిపారు. బీఎల్ఓలు పాస్వర్డ్ లను ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఐ ఆర్ అధికారులు పాల్గొన్నారు.

# నల్లగొండ జిల్లాలో మెడికల్ షాపుల బంద్..

-రోడ్లపైకి దిగిన ఫార్మసీ వ్యాపారులు




**దేవరకొండ మే 20 ( మహాప్రభ )**
ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ పిలుపుతో జిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపులు మూత పడ్డాయి. ఈ-ఫార్మసీ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నల్లగొండలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆన్‌లైన్ మందులు ప్రజల ప్రాణాలతో ఆట.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన మెడికల్ షాప్ యజమానులు.. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల డెలివరీ జరుగుతోందని ఆరోపణలు చేశారు. నకిలీ మందులు, గడువు ముగిసిన మెడిసిన్ విక్రయాలపై ఆందోళన 24 గంటలు ప్రజలకు సేవ చేస్తున్న స్థానిక మెడికల్ షాపులను కాపాడాలి. అంటూ వ్యాపారుల విజ్ఞప్తి చేశారు ఆన్‌లైన్ ఫార్మసీల వల్ల చిన్న మెడికల్ షాపులు మూతపడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో స్వచ్ఛందంగా షాపులు బంద్ చేసి సంఘీభావం తెలిపిన ఫార్మసిస్టులు.. ప్రజల ఆరోగ్య భద్రత కోసం పోరాటం చేస్తున్నాం.. వ్యాపారం కోసం కాదు అంటూ ఫార్మసీ సంఘాల స్పష్టం.. ఈ-ఫార్మసీల నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు

## వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆందోళనలు నిర్వహించాలి

-దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ డివిజన్ మే 20 (మహాప్రభ )**
ఎల్లుండి దేవరకొండ నియోజకవర్గంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద బిఆర్ఎస్ పార్టీ నేతలు ఆందోళనలు నిర్వహించాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ..... వడ్ల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిరసనగా కొనుగోలు కేంద్రాల వద్ద బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేయాలని ఆయన కోరారు.ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనే దిక్కులేక రైతులు అవేదన పడుతున్నారు అని ఆయన అన్నారు.అప్పులు తెచ్చి పంట పండిస్తే కొనే దిక్కులేక పోయారు అని అన్నారు.గన్ని బ్యాగులు ఇచ్చే పరిస్తితిలో ప్రభుత్వం లేదు అని అన్నారు.కేసీఆర్ ఉన్నపుడు ఎప్పుడూ వడ్ల కొనుగోలులో ఇంత ఆలస్యం కాలేదు అని ఆయన గుర్తు చేశారు.ప్రభుత్వం రైతుల నుండి తరుగు పేరిట 2 కేజిల వడ్లు కట్ చేస్తున్నారు అని వెంటనే ఆపాలని కోరారు.మిల్లర్లు 3కేజీలు కట్ చేస్తున్నారు అని ఆయన తెలిపారు.అధికారులు ఏం చేస్తున్నారు కొనుగోలు కేంద్రాల్లో తిరగాలి అని సూచించారు ఈ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుంది అని అన్నారు.పాలన చేతకాకుంటే రేవంత్ రెడ్డి దిగిపోవాలి అని కోరారు.పంట కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైంది అని ఆయన అన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన 7గ్యారంటీలు,420హామీలు అమలు చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు.

## నిరుపేద బీఆర్ఎస్ కార్యకర్తకు వడ్త్య రమేష్ రూ. లక్ష ఆర్థిక సహాయం!



**దేవరకొండ డివిజన్ మే 20 (మహాప్రభ )**
నేరడ గుమ్మ మండలం కొత్తపల్లి కృష్ణ తండ గ్రామానికి చెందిన బుధవారం కార్యకర్త కేతావత్ హార్య నాయక్ నివాసం లేక చిన్న పూరి గుడిసెల్లో నివాసం ఉంటూ ఇబ్బంది పడుతున్న కార్యకర్త నూతన గృహ నిర్మాణనికి తమ వంతు సహాయంగా బి ఆర్ ఎస్ రమేష్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ ఒక లక్ష రూపాయల అర్థిక సహాయాన్నగ్రామ పెద్దల బి ఆర్ ఎస్ నాయకులు సమక్షంలో అందజేశారు అనంతరం వారిని శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మాజీ బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు మండల అధ్యక్షులు లోకాసని తిరుపతయ్య. కేతవత్ పుల్ సింగ్ నాయక్.. శిరమునీ నరసింహ. ఇద్దయ్య గౌడ్. పిఎసిఎస్ డైరక్టర్ రమేష్. మాజీ సర్పంచ్ కొత్తపల్లి కృష్ణయ్య. మాజీ సర్పంచ్ శంకర్. మాజీ సర్పంచ్. భరత్. మద్ది గైర్యా శ్రీనివాస్. జగ్గయ్య నాయక్. పాండు. అనిల్. వార్డు సభ్యులు గోదా సిద్దయ్య. వనం విజయ్. బీమా నాయక్. బాలు నాయక్. రమేష్. తావుర్య నాయక్. చందు నాయక్. లక్పతి నాయక్. అమర్ సింగ్ నాయక్. శ్రీను. గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టుల సమస్యలపై జాప్యం తగదు

**-సమస్యలను ఇకనైనా పరిష్కరించండి**
**-రాష్ట్ర ప్రభుత్వానికి టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్**
**-రాష్ట్ర కేబినెట్ లో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి**



**ఖమ్మం, మే 20:(మహా ప్రభ)**
దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను ఈనెల 23న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో చర్చించి పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన రెండేళ్ళలో దాదాపు ముప్పై సార్లు మంత్రివర్గ సమావేశాలు జరిగాయని, కానీ ఇంతవరకు ఏ ఒక్క మంత్రివర్గ సమావేశంలో జర్నలిస్టుల సమస్యలపై చర్చ జరపలేదని అన్నారు. కనీసం రేపు జరగబోయే మంత్రివర్గ సమావేశంలోనైనా జర్నలిస్టు ప్రధాన సమస్యలపై చర్చించి సమస్యలను పరిష్కరించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళయినా.. ఇంతవరకు కొత్త అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియ పూర్తికాలేదని, జీవో 252 జారీ చేసిన గత నాలుగు మాసాల్లో మూడు సవరణలు ఆరు అభ్యంతాలు, కోర్టు కేసులతో అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియ నత్తనడకలా సాగుతుందని అన్నారు.జర్నలిస్టుల ఇళ్ళస్థలాల సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. హెల్త్ కార్డులు లేక అనేకమంది జర్నలిస్టులు ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రుల్లో వైద్యం లభించక ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న, మధ్య తరహా పత్రికలకు గత రెండేళ్లుగా ప్రభుత్వం జారీచేసిన అడ్వర్టైజ్మెంట్స్ బిల్లులు ఇవ్వలేదని, బిల్లుల బకాయిలు చెల్లించకపోగా, అడ్వర్టైజ్మెంట్స్ ఇవ్వడం కూడా ఆపేసారని ఆయన ధ్వజమెత్తారు. రెండేళ్లుగా బిల్లులు రాక అనేక చిన్న, మధ్య తరహా పత్రికలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, చాలా పత్రికలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ళు జర్నలిస్టుల జీవితాలతో చెలగాటం ఆడిందని.. చిన్న, మధ్య తరహాపత్రికలను అణిచివేసిందని, ఈ ప్రభుత్వం కూడా అదే పద్దతిలో వ్యవహరిస్తున్నదని మామిడి సోమయ్య విమర్శించారు. జర్నలిస్టుల సంక్షేమానికి కొత్త మీడియా పాలసీ చేస్తామని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ళస్థలాలిస్తామని, అక్రెడిటేషన్ కార్డులు, ఆరోగ్య భీమా పథకం కార్డులు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండేళ్లుగా ఏదీ అమలు చేయలేదని అన్నారు. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపకుండా సానుకూలంగా సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. రాష్ట్ర రాజధానిలో ఎటువంటి వివక్ష, వివాదం లేకుండా, సాంకేతికపరమైన సమస్యలు ఎదురుకాకుండా అర్హులైన జర్నలిస్టులందరికి త్వరితగతిన ఇళ్ళస్థలాలు6 కేటాయించాలని ఆయన కోరారు.

# మానవత్వం చాటుకున్న హోంగార్డు

**నందికొట్కూరు, మే 20 ( మహాప్రభ )**
మిడుతూర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు శ్రీనివాసులు మానవత్వాన్ని చాటుకున్నారు.నందికొట్కూరు శివారులో జేసీబీ సేల్స్‌మాన్ సతీష్ తన బ్యాగ్‌ను పోగొట్టుకోగా, అందులో రూ.50 వేల నగదు, ఫైల్స్, కార్డులు, ట్యాబ్




ఉన్నాయి. ఆ బ్యాగ్‌ను హోంగార్డు శ్రీనివాసులు గుర్తించి, సీఐ టి. సుబ్రహ్మణ్యంకు అందజేశారు. ఆధార్ కార్డు ఆధారంగా సతీష్‌ను పిలిపించి, బ్యాగ్‌ను తిరిగి అందజేశారు.ఈ సందర్భంలో సీఐ సుబ్రహ్మణ్యం హోంగార్డు శ్రీనివాసులను అభినందించారు.

# వైభవంగా సామూహిక సత్యనారాయణ వ్రతం

-శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ప్రత్యేక అభిషేకాలు



**గాంధారి, మే 20(మహాప్రభ)**
శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ఆలయం గాంధారి మండల కేంద్రంలో నారాయణగిరి కొండపై కొలువైన శివ భక్త మార్కండేయ ఆలయం వద్ద బుధవారం ప్రత్యేకంగా శివలింగానికి ఆరుద్ర నక్షత్రం శివునికి ప్రీతికరమైన రోజున అన్నఅభిషేకం, ప్రత్యేక పూజలు, అలంకరణ, సామూహిక సత్యనారాయణ వ్రతం, అనేది అనేక కుటుంబాలు ఒకే చోట ఆలయంలో, వేద పండితుల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామిని పూజించే ఒక పవిత్రమైన కార్యక్రమం. ఇది ఐక్యతను, భక్తిని పెంపొందిస్తుంది. ఆరుద్ర నక్షత్రం రోజున, ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అంతేకాకుండా ఆలయం వద్ద ప్రతిరోజు నిత్య పూజలు, అభిషేకాలు వేద పండితులతో ప్రత్యేక పూజలు, నిర్వహించారు. శివ భక్తులు, కుల బంధువులు సభ్యులు, అందరూ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ సభ్యులు, మండల అధ్యక్షుడు గుంటుకు అశోక్, అధ్యక్షుడు క్యాతం కృష్ణ , ఉపాధ్యక్షులు సామల రాజు, కోశాధికారి తాటిపాముల శివ, కార్యదర్శులు సామల విజయ్, కొమ్ముల సంజువ్, తదితరులు పాల్గొన్నారు.

## రాజస్వ మండలాధికారి ఆర్డీవో కార్యాలయంలో సర్ పై అవగాహన సదస్సు



**దేవరకొండ మే 20 ( మహాప్రభ )**
దేవరకొండ రాజస్వ మండలాధికారి (ఆర్డీఓ) కార్యాలయం నందు బుధవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఒక ముఖ్యమైన సమీక్షా సమావేశం నిర్వహించారు . ఈ సమావేశానికి రాజస్వ మండలాధికారి పద్మ ప్రియ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి, అధికారులకు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తగిన సూచనలు చేశారు. సర్ మ్యాపింగ్: సర్ మ్యాపింగ్ ప్రక్రియను నిబంధనల ప్రకారం, గడువులోగా పూర్తి చేయాలని మరియు దానికి సంబంధించిన నియమ నిబంధనలను అందరూ తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. కొత్త ఓటర్ల నమోదు: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువతీ యువకుడు తప్పనిసరిగా కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ: ఓటర్ల జాబితాలో తప్పుల సవరణలు, మార్పులు చేర్పుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. బి ఎల్ ఎ నియామకం: అన్ని రాజకీయ పార్టీలు తమ తమ పార్టీల తరపున బూత్ లెవెల్ ఏజెంట్లను ( బూత్ లెవెల్ ఏజెంట్లను వెంటనే నియమించుకోవాలని, తద్వారా ఓటర్ల నమోదు ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో నియోజకవర్గంలోని అన్ని ప్రముఖ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, ప్రతినిధులు మరియు రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## మెదక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా మార్గం నాగరాజు నియామకం.



**మెదక్ జిల్లా -20మే (మహాప్రభ ).**
కాంగ్రెస్ పార్టీ మెదక్ మండల అధ్యక్షులుగా రాజిపల్లి గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్, మార్గం నాగరాజు నియామకం అయ్యారు.మంగళవారం టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ లు మెదక్ జిల్లాలోని మండలాల అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.అందులో భాగంగానే మెదక్ మండలానికి నాగరాజు ను నియమిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ నా మీద నమ్మకంతో మెదక్ కాంగ్రెస్ పార్టీ మండల్ అధ్యక్షులుగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు,పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులకు కార్యకర్తలకు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. మండలం లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

## చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి.

-రైతులు అధైర్య పడొద్దు.. మధ్యవర్తులను ఆశ్రయించవద్దు
-27,600 మంది రైతులకు 286,60 కోట్ల రూపాయలు రైతుల అకౌంట్లో జమ
-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్..




**మెదక్ జిల్లా -20మే (మహాప్రభ )**
రైతుల నుంచి చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని, రైతులు అధైర్య పడొద్దు అని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ రైతులకు సూచించారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుంచి అదనపు కలెక్టర్ నగేష్,సివిల్ సప్లై అధికారులు, ఆర్డీవో లు, తహసిల్దార్ లు వ్యవసాయ శాఖ అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. రైతుల వద్ద నుంచి ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని, రైతులు అధైర్య పడొద్దు అని ,జిల్లాలో గతం కంటే అత్యంత వేగంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. ఎలాంటి అక్రమాలు లేకుండా పారదర్శకంగా రైతుల నుంచి ఈరోజు వరకు 200,602.200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 39,541 రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి, 27,600 మంది రైతులకు 286,60 కోట్ల రూపాయలు రైతుల అకౌంట్లో జమ చేయడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత స్పీడ్ అప్ చేసి, అకాల వర్షాల నుండి కాపాడడానికి టర్పాలీను కవర్లను అందుబాటులో ఉంచాలని, మిల్లర్లు అన్లోడింగ్ ప్రక్రియను సైతం త్వరిత గతిన చేపట్టాలనీ అధికారులను ఆదేశించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత




**కరీంనగర్ -20మే (మహాప్రభ )**
చొప్పదండికి చెందిన వోల్లల శివకుమార్ తన ఓపో సెల్‌ఫోన్‌ను బొమ్మకల్ డివిజన్‌లోని ఎస్ఎఫ్ఎస్ ఫంక్షన్ హాల్ వద్ద పోగొట్టుకున్నారు. ఈ విషయమై ఆయన కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సి.ఇ.ఐ.ఆర్ టెక్నాలజీ సహాయంతో ఫోన్‌ను ట్రేస్ చేసి హుస్నాబాద్‌లో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి ఆ ఫోన్‌ను యజమాని వోల్లల శివకుమార్‌కు అందజేశారు.ఫోన్ ట్రేస్ చేయడంలో కృషి చేసిన టెక్ టీం సభ్యులు కానిస్టేబుల్ రాంసాయి, సుప్రియలను సిఐ నిరంజన్ రెడ్డి అభినందించారు. పోలీసుల వేగవంతమైన చర్యతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ యజమానికి తిరిగి చేరింది.

## మెదక్ పట్టణ,మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల
## నిర్లక్ష్యంపై బిజెపి ఆధ్వర్యంలో ఎమ్మార్వోకు వినతి..

- రేవంత్ సర్కార్ నిర్లక్ష్యాన్ని నిలదీసిన బిజెపి నాయకులు..



**మెదక్ జిల్లా -20మే (మహాప్రభ ).**
మెదక్ పట్టణ మండల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అధికారుల, రైస్ మిల్లుల నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బిజెపి నాయకులు మండిపడ్డారు.బిజెపి పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్ ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ (ఎమ్మార్వో)కి రైతుల సమస్యలపై వినతిపత్రం సమర్పించి, నిరసన వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ జిల్లా బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడుగడ్డం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా, మండల నాయకులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. లారీల కొరత నిలిచిపోయిన రవాణా: కొనుగోలు కేంద్రాల్లో కాంటా (తూకం) వేసిన వడ్లు సగానికి సగం కూడా ఇంకా రైస్ మిల్లులకు తరలించలేదు. లారీలు సకాలంలో రాకపోవడం వల్ల వడ్ల బస్తాలు వారం రోజుల పాటు సొసైటీల వద్దనే మూలపడి ఉంటున్నాయి. అకాల వర్షాలు -- టార్పాలిన్ల కొరత: ప్రస్తుతం ఉరుములతో కూడిన అకాల వర్షాలు పడుతుండటంతో తూకం వేసిన ధాన్యం తడిసి ముద్దవుతోంది. కాంటా అయిన బస్తాలను కాపాడటానికి కనీసం టార్పాలిన్ (టాపర్లు) కూడా ఏర్పాటు చేయకపోవడం దారుణమని, తీవ్రమైన ఎండల కారణంగా రైతులు కొనుగోలు కేంద్రాల వద్దనే ఉంటూ ఎండదెబ్బకు గురవుతున్నారు. కాబట్టి తక్షణమే ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద వైద్య సదుపాయాలు (మెడికల్ క్యాంప్ )ఏర్పాటు చేయాలని రేవంత్ సర్కార్ ఇప్పటికైనా మత్తు నిద్ర వీడి క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని,యుద్ధప్రాతిపదికన వడ్లను కొనుగోలు చేసి మిల్లులకు తరలించకపోతే, బిజెపి ఆధ్వర్యంలో మెదక్ జిల్లా వ్యాప్తంగా భారీ ఎత్తున రాస్తారోకోలు, ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. “రైతును ఏడ్పించిన ఏ ప్రభుత్వమూ బాగుపడలేదు, అన్నదాతల ఉసురు తగలకుండా ఉండాలంటే ప్రభుత్వం తక్షణమే స్పందించాలి” అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెండె వీణ, లోకేశ్,యం ఎల్ ఎన్ రెడ్డి, కల్కి నాగరాజు. పబ్బా లక్ష్మణు, ఆకుల ప్రభాకర్, నల్లాల విజయ్,అల్లం మధు, బజ్జురి బిక్షపతి, అంకం శ్రీను, లింగ రాజు.సన్నీ, గొల్ల కిరణ్,ఆముదం సాయిరాం,మెదక్ జిల్లా మరియు మండల బిజెపి కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చరిత్ర ఆనవాళ్లుకు ప్రసిద్ధి
# మెదక్ పర్యాటక ప్రాంతాలు






-మెదక్ జిల్లా సుసంపన్నమైన చారిత్రక మరియు సాంస్కృతిక వారసత్వాన్ని కలిగి ఉంది.
-భావితరాలకు అందించేలా జిల్లాలో ఉన్న అన్ని పర్యాటక ప్రాంతాలను డాక్యుమెంటరీ తయారీ.

**మెదక్ జిల్లా -20మే (మహాప్రభ )**
99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక “పర్యాటక వారోత్సవాల” సందర్భంగా హెరిటేజ్ వాక్ లో జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్, అదనపు కలెక్టర్ నగేష్ లు పాల్గొన్నారు. చరిత్రకు ఆనవాళ్లు మెదక్ పర్యాటక ప్రాంతాలని . భావితరాలకు మెదక్ చారిత్రాత్మక పర్యాటక ప్రాంతాల ఉనికి అందించేలా డాక్యుమెంటరీ తయారీ చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. బుధవారం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక “పర్యాటక వారోత్సవాల” సందర్భంగా హెరిటేజ్ వాక్ లో అదనపు కలెక్టర్ నగేష్ , డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ ,మెదక్ ఆర్డీవో రమాదేవి, మత్స్యశాఖ అధికారి మల్లేశం యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, డిపిఓ యాదయ్య, ఇరిగేషన్ ఈ .ఈ శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు, యువత, క్రీడాకారులు, మున్సిపల్ సిబ్బంది తో కలిసి కలెక్టర్ హెరిటేజ్ వాక్ లో పాల్గొన్నారు ఈ సందర్భంగా ముందుగా వెస్లీ పాఠశాలను, మెదక్ చర్చిని, గుల్సన్ క్లబ్ అనంతరం మెదక్ పోర్ట్ సందర్శించి హెరిటేజ్ వాక్ నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లా సుసంపన్నమైన చారిత్రక మరియు సాంస్కృతిక వారసత్వాన్ని కలిగి ఉందన్నారు. మెదక్ జిల్లా పర్యాటక ప్రాంతాల. ఉనికి. భావితరాలకు అందించేలా జిల్లాలో ఉన్న అన్ని పర్యాటక ప్రాంతాలను డాక్యుమెంటరీ తయారీ చేస్తున్నట్లు వివరించారు. మెదక్ చర్చ్, ,గోల్ బంగ్లా. బారాకమాన్, మెదక్ పోర్ట్ ఆ ప్రాంతాల సందర్శించి చరిత్రను తెలుసుకోవడం జరిగిందన్నారు. మెదక్ పోర్ట్ అనేది చారిత్రాత్మక పర్యాటక ప్రాంతంగా పర్యాటకులను ఆకర్షిస్తుందన్నారు మెదక్ పట్టణానికి అత్యంత దగ్గరగా ఉంటుందని పర్యాటకులు తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు హెరిటేజ్ వాక్ లో భాగంగా జిల్లా అధికారులు ఈ ప్రాంతాన్ని సందర్శించడం జరిగిందన్నారు మెదక్ పోర్ట్ ప్రాంతంలో మరమ్మత్తులకు అవకాశం ఉన్నందున ఈనెల 22 రోజున హెరిటేజ్ ప్రాంతాలను హైలెట్ చేయడంలో భాగంగా మరమ్మత్తులు నిర్వహించి శానిటేషన్ డ్రైవ్, లైటింగ్ ఏర్పాటుచేసి యువతను పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యత భావితరాలకు అందించే విధంగా దృష్టి సారిస్తున్నట్లు వివరించారు అన్ని హెరిటేజ్ ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ జిల్లా పంచాయతీ శాఖ సమన్వయంతో ఒక ప్రణాళిక ప్రకారం జిల్లాలో ఉన్న ఆ ప్రాంతాలలు చరిత్ర పుటల్లోకి ఎక్కిన పర్యాటక ప్రాంతాలైన , బురుజులు, చారిత్రాత్మక దేవాలయాలు, డాక్యుమెంటరీ తయారు చేసి హెరిటేజ్ పుస్తక రూపంలో భద్రపరుస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు . పర్యాటక ప్రాంతాలలో పర్యాటకులకు రిహాబిటేషన్ సౌకర్యం కల్పించడానికి సిఎస్ఆర్ ఫండ్స్ స్టేట్ లెవెల్ నిధులను దరఖాస్తు చేయిస్తామన్నారు. భావితరాలకు మెదక్ చరిత్ర పుటల ఉనికి తెలియ జే యాలన్నది దీని యొక్క ముఖ్య ఉద్దేశం గా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, యువత, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్యం పై పరిశోధన ప్రజా జీవన విధానం




**దేవరకొండ మే 20 ( మహాప్రభ)**
సాహిత్యం పై ఆమె పరిశోధనలు ,ప్రజల జీవన విధానం నాగరికత సంస్కృతి కమ్మనైన పాటలకు రూప శిల్పి శిలా కళ జాత డాక్టర్ బండారు సుజాత శేఖర్ అని ప్రముఖ కవి ముంబై అలం బల్ల అన్నారు. గొప్ప సాహిత్యకారిణి,గాయని, రచయిత్రి ,తెలంగాణ బతుకమ్మ పాటల తొలి పరిశోధకురాలు డాక్టర్ బండారు సుజాతశేఖర్ రచించిన దీర్ఘ కవిత మట్టి గీతం,భూమి తల్లి ప్రశస్తిని,మట్టి తత్వాన్ని, మనిషి మనుగడను పలు కోణాల్లో స్పష్టం చేసిందని, అణువు నుండి అణ్వాయుధం వరకు సృషించిన మీరు గొప్పగా ఉండని అందరినీ చదివించేలా ఉందని ప్రముఖ కవి ముంబై అంబల్ల జనార్ధన్ అన్నారు. సమావేశం మందిరంలో డాక్టర్ బండారు సుజాత శేఖర్ రచించిన మట్టిగీతం పుస్తకావిష్కరణ సభ జరిపి అవార్డు గ్రహీత దామోదర మౌల్జ గారి ఆసక్తులతో ఆవిష్కరించండి పాల్గొన్నారు ఈ ఆవిష్కరణ వేదికకు ప్రత్యేక అతిధులుగా ముచ్చర్ల మందిర్ సైంటిస్ట్ తులాల సవరమ్మ పాల్గొన్నారు ఎఫ్ఆర్ మహారాష్ట్ర మేక మీడియా ముంబై భారతం సంయుక్త నిర్వహణలో జరిగిన ఈ సభకు సభాధ్యక్షులుగా గంజి జగన్ బాబు కార్యక్రమం నిర్వాహకులుగా కంటే అశోక్ మరియు గౌరవాధ్యక్షుడుగా దాచేపల్లి బుచ్చయ్య హాజరైనారు. జీవన తాత్విక తో, మనిషి జీవితాన్ని మట్టీ తో బంధాన్ని తెలియజేస్తూ, కుల మత అతీత విశ్వ మానవ శాంతి సందేశం తో సాగిందని, తన మట్టీ గీతం ప్రచురణ కు, ఆవిష్కరణకు సహకారం అందించిన అందరికీ కవయిత్రి సుజాత శేఖర్ వందనాలు తెలియజేశారు.శతాధిక కడలి కవిసమ్మేళనం,గోవా కడలి కేళి పేరుతో నిర్వహించగా, అద్భుతస్పందన కనిపించింది. ఏడు రాష్ట్రాలవారు,గోవా తెలుగు వారు అత్యధికంగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆరుగురికి గోవాకడలి సేవా రత్న మరియు గోవా కడలి కవి రత్న అవార్డు ఇచ్చి సత్కరించారు.

## కళలకు నెలవు మెదక్ జిల్లా

### జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ జిల్లా -20మే (మహాప్రభ ).**
మెదక్ జిల్లా కళలకు నెలవని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ మీటింగ్ హాల్లో యువజన కేంద్రాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం జానపద , సంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ



సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ..

మెదక్ జిల్లా కళలకు నెలవన్నారు. వివిధ సంస్కృతి సాంప్రదాయాలకు పెట్టింది మారుపేరు అని అన్నారు. భవిష్యత్ లో కళలకు మరింత గుర్తింపు తేవాలన్నారు. విద్యార్థుల జానపద డ్యాన్స్ అలరించాయి. జానపద డ్యాన్స్ లో ప్రతిభ చూపించిన విద్యార్థుల ప్రశంస పత్రము అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన ,క్రీడల అధికారి రమేష్, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, తాసిల్దార్లు పాల్గొన్నారు.

# బిజినెస్

## భారత వృద్ధి 6.4 శాతమే..!

### ఐక్యరాజ్యసమితి అంచనా




**వాషింగ్టన్**
పశ్చిమాసియా తీవ్ర సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కోలుకోలేని దెబ్బ తీసింది. ఇది అంతర్జాతీయంగా ఆర్థిక వృద్ధిని మందగించేలా చేయడమే కాకుండా.. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను పెంచడంతో తీవ్ర అనిశ్చితిని సృష్టించింది. ఈ ప్రతికూల ప్రపంచ పరిస్థితుల కారణంగానే ఐక్యరాజ్యసమితి (యుఎన్) ఈ ఏడాది భారత వృద్ధి రేటును అంచనాను గతంలో వేసిన 6.6 శాతం నుంచి 6.4 శాతానికి కోత పెట్టింది. ప్రస్తుత అంతర్జాతీయ సవాళ్లు, ఆర్థిక ఒడిదొడుకుల నుండి భారత్‌కు మినహాయింపు ఏమీ లేదని యుఎన్ డిఇఎస్ఎ స్పష్టం చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో పెరిగే ఇంధన ధరలు దేశ ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. దీనికి తోడు, అంతర్జాతీయంగా నెలకొన్న కఠిన ఆర్థిక పరిస్థితుల వల్ల దేశంలోకి వచ్చే విదేశీ నిధుల ప్రవాహం కూడా ప్రభావితమయ్యే ముప్పు ఉందని యుఎన్ పేర్కొంది. ఈ పరిణామాలతో 2026లో జిడిపి 6.4 శాతానికి పరిమితం కానుందని.. ఆ తర్వాత ఏడాది 2027లో 6.6 శాతం వృద్ధి రేటు నమోదు కావొచ్చని పేర్కొంది. ప్రస్తుత ప్రతికూలతల వల్ల 2026లో ప్రపంచ దేశాల మొత్తం జిడిపి వృద్ధి రేటు కూడా 2.5 శాతానికి పడిపోనుందని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఇది జనవరిలో వేసిన అంచనా కంటే 0.2 శాతం తక్కువ కావడం గమనార్హం.

## గోల్డ్ ప్రియులకు బ్యాడ్‌న్యూస్..


### ఒక్కసారిగా భారీగా పెరిగిన ధరలు.. ఇప్పుడు తులం ఎంతంటే..?




బంగారం కొనుగోలు చేసేవారికి బ్యాడ్ న్యూస్. ధరలు ఒక్కసారిగా పెరిగాయి. గంటల వ్యవధిలోనే ధరల్లో ఊహించని మార్పులు చోటుచేసుకున్నాయి. ఉదయం ధరలు ఒకలా ఉండగా.. మార్కెట్లు ప్రారంభం కాగానే ధరలు ఒక్కసారిగా ఎగబాకాయి. దీంతో గోల్డ్ కొనాలనుకునేవారికి ఇది పెద్ద నిరాశను మిగిల్చింది. ఈ పెంపు తర్వాత బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయనేది ఒకసారి చూద్దాం.ప్రస్తుతం హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,58,350గా ఉండగా.. మంగళవారం రూ.1,57,040 వద్ద స్థిరపడింది. నిన్నటితో పోలిస్తే బుధవారం ఒక్కసారిగా రూ.1310 పెరిగింది. ఇక 22 క్యారెట్ల రేటు మంగళవారం రూ.1,43,950 వద్ద ఉండగా.బువారం రూ.1,45,150 వద్ద కొనసాగుతోంది. బుధవారం ఒక్కరోజే రూ.1200 పెరిగింది.ఇక విజయవాడ, విశాఖపట్నంలో కూడా పై ధరలే కొనసాగుతున్నాయి. చెన్నైలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,60,910 వద్ద ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,47,500 వద్ద కొనసాగుతోంది. ఇక ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,58,500 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,45,300 వద్ద ఉంది.అటు బెంగళూరులో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన మేలిమి బంగారం ధర రూ. 1,58,350 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,45,150 వద్ద ఉంది. ఇక ముంబైలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. నిన్నటితో పోలిస్తే ముంబైలో రూ.వెయ్యికిపైగా గోల్డ్ రేటు పెరిగింది.అటు సిల్వర్ ధరలు మాత్రం తగ్గాయి. హైదరాబాద్‌లో బుధవారం కేజీ వెండి ధర రూ.2.85 లక్షలుగా కొనసాగుతోంది. నిన్న ఇది రూ.3 లక్షలుగా ఉంది. నిన్నటితో పోలిస్తే రూ.15 వేలు పెరిగింది. ఇక చెన్నైలో కూడా రూ.2.85 లక్షలుగా ఉంది. ఇక ఢిల్లీలో కిలో వెండి రూ.2.80 లక్షలుగా ఉంది. నిన్న రూ.2.85 లక్షల వద్ద స్థిరపడింది.

## మరోసారి భారీ ఉద్యోగాల కోతకు మెటా సిద్ధం

### 8 వేల మందిపై ప్రభావం





**సింగపూర్**
మెటా ప్లాట్‌ఫామ్స్ మరోసారి భారీ స్థాయిలో ఉద్యోగుల తొలగింపులకు సిద్ధమైంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మరియు వాట్సాప్ మాతృసంస్థ అయిన మెటా, ఖర్చులను తగ్గించుకోవడం మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో పెట్టుబడులను పెంచే వ్యూహంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 8,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు సమాచారం. కంపెనీ ఆసియా ప్రధాన కేంద్రం ఉన్న సింగపూర్ లో బుధవారం ఉదయం నుంచే తొలగింపుల ప్రక్రియ ప్రారంభమైంది. అమెరికా, యూరప్ ప్రాంతాల్లోని ఉద్యోగులకు కూడా త్వరలో అధికారిక నోటీసులు జారీ కానున్నట్లు మెటా అంతర్గత మెమోలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఉద్యోగులను ఇంటి నుంచే పని చేయాలని కంపెనీ సూచించింది. ముఖ్యంగా ఇంజనీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ విభాగాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉండనుంది. మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ ఏఐ టెక్నాలజీ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గూగుల్ మరియు ఓపెన్‌ఏఐ వంటి సంస్థలతో పోటీ పడేందుకు మెటా ఈ ఏడాది ఏఐ రంగంలో భారీ పెట్టుబడులు పెట్టుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే సుమారు 7,000 మంది ఉద్యోగులను ఏఐ ప్రాజెక్టులకు బదిలీ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. చిన్న బృందాలతో పని చేయడం ద్వారా ఉత్పాదకత పెరుగుతుందని సంస్థ భావిస్తోంది. అయితే, వరుస ఉద్యోగాల కోతలతో ఉద్యోగుల్లో ఆందోళన పెరుగుతోంది. అదనంగా, ఏఐ శిక్షణ కోసం ఉద్యోగుల కంప్యూటర్లలో కీస్ట్రోక్‌లు, మౌస్ కదలికలు, స్క్రీన్ కార్యకలాపాలను పర్యవేక్షించాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా వెయ్యికి పైగా ఉద్యోగులు జుకర్‌బర్గ్‌కు వినతిపత్రం సమర్పించినట్లు సమాచారం. ఇక, ఏఐ రంగంలో మెటా చేస్తున్న భారీ పెట్టుబడులు దీర్ఘకాలంలో ఎంత మేర లాభాలను తీసుకువస్తాయనే అంశంపై పెట్టుబడిదారుల్లో కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## బంగ్లాదేశ్ చేతిలో పాకిస్తాన్ చిత్తు




పాకిస్తాన్ కు వరుస పరాజయాల బెడద తప్పట్లేదు. బంగ్లాదేశ్ చేతిలో మరోసారి చిత్తు చిత్తుగా ఓడింది. సిల్హెట్ స్టేడియంలో బంగ్లాదేశ్ తో జరిగిన రెండో టెస్టులో 78 పరుగుల తేడాతో పరాజయాన్ని చవి చూసింది. రెండు టెస్ట్ మ్యాచ్ ల సిరీస్‌ను 0-2 తేడాతో ఓడిపోయింది. బంగ్లాదేశ్ చేతిలో వైట్ వాష్ కు గురైంది. ఈ మ్యాచ్‌లో 437 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించలేక పాకిస్తాన్ 358 పరుగులకే ఆలౌట్ అయింది. ఇది.. ఆతిథ్య జట్టుకు ఘన విజయాన్ని అందించింది.తొలి ఇన్నింగ్ లో బంగ్లాదేశ్ 278 పరుగులకు ఆలౌట్ అయింది. లిట్టన్ దాస్ సెంచరీతో కదం తొక్కాడు. 126 పరుగులు చేశాడు. పాకిస్తాన్ బౌలర్లల్లో ఖుర్రం షెహజాద్- 4, మహ్మద్ అబ్బాస్- 3 వికెట్లతో చెలరేగారు. బౌలర్లు రాణించినా బ్యాటర్లు చేతులెత్తేశారు. తొలి ఇన్నింగ్ లో 232 పరుగులకే చాప చుట్టేసింది పాకిస్తాన్. బాబర్ ఆజమ్ చేసిన 68 పరుగులే టాప్ స్కోర్. లోయర్ ఆర్డర్ బ్యాటర్ సాజిద్ ఖాన్ 38 పరుగులతో ఆదుకోకపోతే మరింత అధ్వాన్నంగా మారేదా జట్టు పరిస్థితి.రెండో ఇన్నింగ్ లో కూడా తన దూకుడు కొనసాగించింది బంగ్లాదేశ్. ఈ ఇన్నింగ్ లో కూడా సెంచరీ నమోదైంది. ముష్ఫికుర్ రహీం 137 పరుగులు బాదాడు. అతనికి తోడుగా ఓపెనర్ మహ్మదుల్ హసన్ జాయ్- 52, లిట్టన్ దాస్ 69 పరుగులు చేయడంతో బంగ్లాదేశ్ స్కోర్ బోర్డు పరుగులు పెట్టింది. 390 వద్ద నిలిచింది. మొత్తంగా 437 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ ఇన్నింగ్ పడుతూ లేస్తూ సాగింది. జట్టు స్కోర్ 41 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఓపెనర్లిద్దరూ అవుట్ అయ్యారు. అజాన్ అవైస్- 21, అబ్దుల్లా ఫజల్- 6 పరుగులకు పెవిలియన్ చేరారు.ఆ తర్వాత కేప్టెన్ షాన్ మసూద్- 71, బాబర్ ఆజమ్- 47 పరుగులతో మూడో వికెట్ కు భారీ భాగస్వామ్యాన్ని అందించారు. వీరిద్దరూ అవుట్ అయ్యాక కూడా అదే పోరు కొనసాగింది. లోయర్ మిడిల్ ఆర్డర్ లో సల్మాన్ ఆఘా- 71, వికెట్ కీపర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్- 94 పరుగులతో గెలిపించే ప్రయత్నం చేశారు గానీ మిగిలిన బ్యాటర్ల నుంచి వారికి ఎటువంటి సహకారం అందలేదు. సవూద్ షకీల్- 6, సాజిద్ ఖాన్- 28 పరుగులు చేయగా.. హసన్ అలీ, ఖుర్రం షెహజాద్ డకౌట్ అయ్యారు. దీంతో 358 పరుగుల వద్ద పాకిస్తాన్ ఇన్నింగ్ చతికిలపడింది. బంగ్లాదేశ్ బౌలర్ తైజుల్ ఇస్లాం.. పాకిస్తాన్ బ్యాటింగ్ ఆర్డర్ నడ్డి విరిచాడు. ఆరు వికెట్లు పడగొట్టి ఆ జట్టు పతనాన్ని శాసించాడు. నహీద్ రానా- 2 వికెట్లు తీసుకోగా.. షోరిఫుల్ ఇస్లాం, మెహదీ హసన్ మిరాజ్ ఒక్కో వికెట్ నేల కూల్చారు.

## విరాట్ కోహ్లీ సంపాదన ఎంతో తెలుసా?





ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్రికెట్ క్రీడా పండుగ ఇండియన్ ప్రీమియర్ లీగ్. 2008లో ప్రారంభమైన ఈ క్యాష్ రిచ్ లీగ్, ప్రస్తుతం 19వ సీజన్‌ను (ఐపీఎల్ 2026) విజయవంతంగా జరుపుకుంటోంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఐపీఎల్ ద్వారా అత్యధిక పారితోషికం అందుకున్న ఆటగాడిగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్, 'రన్ మెషీన్' విరాట్ కోహ్లీ సరికొత్త చరిత్ర సృష్టించాడు. 'ఫ్యానాటిక్ స్పోర్ట్స్', 'హురున్' సంయుక్తంగా విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. కోహ్లీ తన ఐపీఎల్ కెరీర్‌లో కేవలం ఫ్రాంచైజీ పారితోషికం రూపంలోనే ఏకంగా రూ.230.2 కోట్లు ఆర్జించాడు.2008లో కేవలం 19 ఏళ్ల వయసులో అండర్-19 వరల్డ్ కప్ గెలిచి వచ్చిన కోహ్లీని ఆర్సీబీ తొలి వేలంలో కేవలం రూ.12 లక్షల బేస్ ప్రైస్‌కు కొనుగోలు చేసింది. 18 ఏళ్లుగా ఒకే ఒక్క ఫ్రాంచైజీకి ఆడుతూ, అత్యధిక పారితోషికం అందుకుంటున్న ఆటగాడిగా కోహ్లీ ఎదిగిన తీరు అద్భుతం. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ మొత్తం ఐపీఎల్ సంపాదన రూ.230.2 కోట్లుగా లెక్క తేలింది. అయితే ఈ డబ్బు ఆయన కేవలం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్ ద్వారానే సంపాదించడం విశేషం. ఐపీఎల్‌లో అత్యధికంగా సంపాదించిన ఆటగాళ్ల జాబితాలో విరాట్ కోహ్లీ తర్వాత భారత సీనియర్ ఆటగాళ్లే ఆధిపత్యం చలాయిస్తున్నారు.ఈ నివేదిక కేవలం ఆటగాళ్ల సంపాదననే కాదు, ఐపీఎల్ జట్ల మార్కెట్ విలువను కూడా వెల్లడించింది. ప్రస్తుతం ఐపీఎల్‌లోని 10 ఫ్రాంచైజీల మొత్తం బ్రాండ్ విలువ అక్షరాలా రూ.1.63 లక్షల కోట్లకు చేరుకుంది.

# స్పోర్ట్స్

## ఆ సంకేతానికి అర్థం లేదు..


## సూర్యవంశీ వెరైటీ సెలబ్రేషన్..




**జైపూర్**
15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ.. లక్నోతో జరిగిన మ్యాచ్‌లో దుమ్మురేపాడు. కేవలం 38 బంతుల్లో 93 రన్స్ చేశాడు. ఆ రాజస్థాన్ బ్యాటర్ ఇన్నింగ్స్‌లో పది సిక్సర్లు, ఏడు బౌండరీలు ఉన్నాయి. అయితే హాఫ్ సెంచరీ చేసిన తర్వాత వైభవ్ వెరైటీగా సెలబ్రేట్ చేసుకున్నాడు. రెండు చేతి వేళ్లను క్రాస్ చేస్తూ ఓ ఫోజ్ ఇచ్చారు. ఆ సెలబ్రేషన్‌లో వాస్తవానికి సూర్యవంశీ ఎటువంటి సంకేతాన్ని ఇస్తున్నాడో అర్థం కాలేదు. ఇక ఆ భారీ స్కోరు మ్యాచ్‌లో విజయం సాధించిన తర్వాత మురళీ కార్తీక్‌తో ఆ సంకేతం గురించి మాట్లాడారు. ఆ సంకేతం వెనుక తాత్పర్యం ఏంటని మురళీ ప్రశ్నించారు. దానికి సూర్యవంశీ స్పందిస్తూ అదేం సంకేతమో తనకు తెలియదని, కానీ ప్రతి మ్యాచ్‌లోనూ కొత్తగా ఏదో ఒకరకంగా సెలబ్రేట్ చేసుకుంటానని, తన సెలబ్రేషన్‌లో ఎటువంటి అర్థం లేదని, గత మ్యాచ్‌లో కూడా భిన్నంగా తాను సెలబ్రేట్ చేసుకున్నట్లు సూర్యవంశీ చెప్పాడు. ఎప్పుడూ కొత్తగా ఏదో ఒకటి చేస్తూనే ఉంటానన్నాడు.ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాలంటే తప్పక గెలువాల్సిన పోరులో రాజస్థాన్ రాయల్స్ సత్తాచాటింది. వైభవ్ వీరబాదుడు బ్యాటింగ్‌తో చెలరేగడంతో సొంతగడ్డపై మంగళవారం జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో లక్నోపై ఘన విజయం సాధించింది. లీగ్‌లో ఏడో విజయంతో పంజాబ్‌ను వెనక్కునెట్టి నాలుగో స్థానానికి చేరింది. తమ చివరి మ్యాచ్‌లో గెలిస్తే ఇతర సమీకరణాలతో సంబంధం లేకుండా రాయల్స్ నేరుగా ప్లేఆఫ్స్ చేరుకోనుంది. లక్నో ఇచ్చిన 221 పరుగుల లక్షాన్ని రాయల్స్ 19.1 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి అందుకుంది. ధ్రువ్ జురెల్ (38 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 53 నాటౌట్), స్టాండిన్ కెప్టెన్ యశస్వి జైస్వాల్ (43) కూడా రాణించారు. తొలుత మిచెల్ మార్ష్ (57 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 96), జోష్ ఇంగ్లిస్ (29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 60) మెరుపులతో లక్నో 20 ఓవర్లలో 220/5 స్కోరు చేసింది. వైభవ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

# డ్రాగన్ గ్లింప్స్ రిలీజ్

## సోషల్ మీడియాలో షేక్





దర్శకుడు ప్రశాంత్ నీల్, తారక్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ టైటిల్‌ను చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటిస్తూ పవర్‌ఫుల్ ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఎన్టీఆర్ పుట్టినరోజు కానుకగా ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. మే 19 అర్ధరాత్రి తారక్ బర్త్‌డేకి కొన్ని నిమిషాల ముందే విడుదలైన ఈ గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

ప్రశాంత్ నీల్ తన మార్క్ డార్క్ థీమ్‌తో ఏకంగా 4 నిమిషాల 28 సెకండ్ల నిడివితో ఒక భారీ విజువల్ వండర్‌ను ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ గ్లింప్స్ వీడియో 1967 నాటి అంతర్జాతీయ ఓపియం బ్యాక్‌డ్రాప్‌లో, గోల్డెన్ ట్రయాంగిల్ నేపథ్యంలో సాగే ఒక క్రూరమైన, హింసాత్మకమైన చీకటి ప్రపంచాన్ని కళ్లకు కట్టింది. ఇందులో హీరోయిన్ రుక్మిణి వసంత్ వాయిస్ ఓవర్‌తో కథా నేపథ్యాన్ని, అందులోని పాత్రలను పరిచయం చేస్తూ చివరగా అసలైన 'డెవిల్'ను ఎంట్రీ చేయించారు. అఫ్ఘాన్ ట్రేడింగ్ కంపెనీకి 'చీఫ్ అసస్సిన్' (ప్రధాన హంతకుడు) అయిన 'లూగర్'అనే అత్యంత భయంకరమైన పాత్రలో ఎన్టీఆర్ లుక్ మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. ఈ గ్లింప్స్‌లో ఎన్టీఆర్ రఫ్ అండ్ లీన్ లుక్, గంభీరమైన కళ్లు అభిమానులకు పూనకాలు తెప్పిస్తున్నాయి. ముఖ్యంగా ఒక సీన్ లో శవాల దిబ్బపై నిలబడి ఎన్టీఆర్ చెప్పే డైలాగ్ థియేటర్లలో విసిల్ వర్తీగా నిలవడం ఖాయం. 'దేవుడు నాకో గొప్ప వరం ఇచ్చాడు.. ట్రిగ్గర్ నొక్కగానే మర్చిపోవడం' అంటూ తారక్ బేస్ వాయిస్‌తో చెప్పిన డైలాగ్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ప్రశాంత్ నీల్ సృష్టించిన ఈ సరికొత్త ప్రపంచంలో ఎన్టీఆర్ క్యారెక్టరైజేషన్ మునుపెన్నడూ చూడని విధంగా, ఒక ఊరమాస్ బీస్ట్ మోడ్లో ఉంది. ఈ భారీ యాక్షన్ డ్రామాలో బాలీవుడ్ ఎవర్ గ్రీన్ స్టార్ అనిల్ కపూర్ ఇండియన్ నార్కోటిక్స్ బ్యూరో చీఫ్ 'రఘువీర్ రాథోడ్'గా ఒక పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తుండగా, బిజు మీనన్, ఖుష్బూ సుందర్, అశుతోష్ రాణా, గురు సోమసుందరం, రాజీవ్ కనకాల వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. రవి బస్రూర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరియు భువన్ గౌడ విజువల్స్ ఈ గ్లింప్స్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం 5 భాషల్లో ప్రపంచవ్యాప్తంగా జూన్ 11, 2027న థియేటర్లలోకి రానుంది.

# హాట్ గ్లామర్‌తో రెచ్చిపోయిన రెజీనా




# గ్రామీణ నేపథ్యంలో హైలెస్సో




సుడిగాలి సుధీర్‌గా పేరుపొందిన సుధీర్ ఆనంద్ కథానాయకుడిగా రూపొందుతున్న ఎమోషనల్ డ్రామా 'హైలెస్సో'. ప్రసన్నకుమార్ కోట దర్శకుడు. శివ చెర్రీ, రవికిరణ్ నిర్మాతలు. ప్రముఖ నటుడు శివాజీ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తుండటం విశేషం. మంగళవారం సుధీర్ పుట్టినరోజు సందర్భంగా కొత్త పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు.రఫ్ లుక్‌లో, గంటలు కట్టిన ఖడ్గాన్ని చేతపట్టుకొని రక్తపు మరకలతో పవర్‌ఫుల్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న సుడిగాలి సుధీర్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బలమైన ఎమోషన్స్ కూడా ఉంటాయని, సుధీర్ ఇప్పటివరకూ చేసిన పాత్రలకు పూర్తిభిన్నమైన పాత్రను ఇందులో పోషిస్తున్నారని, ఇప్పటికే హైదరాబాద్‌లో 25రోజుల షెడ్యూల్ పూర్తయిందని, త్వరలోనే ఏలూరులో 40రోజుల భారీ షెడ్యూల్ ప్రారంభం కానున్నదని మేకర్స్ తెలిపారు.



# అతనిని బాగా నమ్మి మోసపోయా..

### మూడేళ్లపాటు నరకం చూశా.. బ్రేకప్ స్టోరీ చెప్పిన అనన్య నాగళ్ల




ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన అనన్య నాగళ్ల సినిమాల్లోకి రాక ముందు ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కొన్నాళ్లు వర్క్ చేసింది. అయితే నటనపై ఆసక్తితో మొదట షార్ట్ ఫిల్మ్స్ చేసింది. ఆ తర్వాత సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. మల్లేశం సినిమాతో వెండితెరకు పరిచయమైన అనన్య నాగళ్ల అతి కొద్ది కాలంలోనే నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్లే బ్యాక్, వకీల్ సాబ్, మ్యాస్ట్రో, ఊర్వశివో రాక్షసివో, శాకుంతలం, మళ్లీపెళ్లి, అన్వేషి, తంత్ర, డార్లింగ్, పొట్టేల్, శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ తదితర సినిమాలలో అనన్య నటించింది. ఓవైపు హీరోయిన్ గా మెప్పిస్తూనే మరోవైపు సహాయక నటిగానూ ఆకట్టుకుందీ అందాల తార. ప్రస్తుతం చేతి నిండా సినిమాలతో బిజీగా ఉంటోన్న అనన్య రీసెంట్ గా ఒక ఇంటర్వ్యూకు హాజరైంది. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ విషయాలను అందులో షేర్ చేసుకుంది. ఇదే సందర్భంగా తన బ్రేకప్ స్టోరీని కూడా చెప్పి బాధపడింది.ఇటీవలి కాలంలో దేని గురించైనా ఏడ్చావా? ఎందుకు ఏడ్చావని అని యాంకర్ ప్రశ్నించగా అనన్య ఇలా సమాధానమిచ్చింది. ' చాలా ఏళ్ల తర్వాత బాగా ఏడ్చాను. అది కూడా ఒక వ్యక్తి వల్ల. ఇది లవ్ బ్రేకప్, లవ్ ఫెయిల్యూర్ అని నేను చెప్పను. కానీ ఒక వ్యక్తిని బాగా నమ్మాను. కానీ మోసపోయాను. ఉదయాన్నే నిద్రలేవగానే ఆ ఆలోచనలే వెంటాడతాయి. ఎంత బిజీగానే ఉన్నా అవే గుర్తొస్తూనే ఉంటాయి. బ్రేకప్ తాలూకా బాధను మూడేళ్లపాటు అనుభవించా. అయితే షూటింగ్స్‌కి మాత్రం అస్సలు మిస్ అయ్యే దానిని కాదు. రాత్రంతా ఏడ్చినా తెల్లవారగానే జిమ్‌కి వెళ్లిపోయాదాన్ని. షూటింగ్‌లో కేరవాన్‌లోనే కూర్చొని నా షాట్ వచ్చే వరకు వెక్కి వెక్కి ఏడ్చేదానిని. తర్వాత కళ్లు తుడుచుకుని నా పని చూసుకునేదానిని. నాకు తెలిసి చాలా మంది అమ్మాయిలకు ఇవే ప్రాబ్లమ్స్ ఉంటాయి. అమ్మాయిలు చాలా సెన్సిటివ్. అమ్మాయిలు వదిలేసి వెళ్లిపోతారని చాలా మీమ్స్ సోషల్ మీడియాలో వస్తుంటాయి. ఎన్నో మాటలు అంటారు. అబ్బాయిలు ఎక్కువగా ఉండటం, కంటెంట్ క్రియేటర్స్ కూడా వాళ్లే ఉండటం వల్ల వాళ్ల పాయింట్ ఆఫ్ వ్యూ బయటకు వస్తుంది. మన పాయింట్ ఆఫ్ వ్యూ బయటకు రావడం లేదు' అని అనన్య ఎమోషనలైంది. ప్రస్తుతం ఈ తెలుగమ్మాయి కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి

# నటనకు భాష ముఖ్యం



మరాఠీ మందారం భాగ్యశ్రీబోర్సేకి సరైన విజయాలు లేకపోయినా.. సరైన అవకాశాలు మాత్రం తలుపుతడుతూనేవున్నాయి. తమిళంలో శివకార్తికేయన్ కథానాయకుడిగా కమల్‌హాసన్ నిర్మిస్తున్న 'సెయాన్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రంలోని తన పాత్ర గురించి భాగ్యశ్రీ బోర్సే మాట్లాడింది. 'ఈ సినిమాలోని నా పాత్ర గురించి ఇప్పుడే ఏం చెప్పలేను. అయితే.. ఈ కథలో నా పాత్ర కీలకమని మాత్రం చెప్పగలను. నన్ను ఉత్తమనటిగా ప్రేక్షకుల ముందు నిలబెట్టే పాత్ర ఇదిఅందులో సందేహం లేదు. ఏదైనా పాత్ర చేస్తున్నప్పుడు ఆ పాత్రను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే భాష చాలా ముఖ్యం. కథలోని భావోద్వేగాలను అర్థం చేసుకోకుండా నటిస్తే, అది నిరర్థకమే. అందుకే.. నిజాయితీగా ముందు భాష తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాను. తెలుగులో విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'కింగ్‌డమ్' సినిమా నటించేటప్పుడు నా పాత్ర కోసం తెలుగు నేర్చుకొని, డబ్బింగ్ కూడా నేనే చెప్పుకున్నా. అదే విధంగా త్వరలో 'సెయాన్' కోసం తమిళం నేర్చుకొని, నా పాత్రకు నేనే డబ్బింగ్ చెబుతా' అని పేర్కొన్నది భాగ్యశ్రీ బోర్సే.

# బాలయ్య సినిమాలో మంచు మనోజ్!




'వీర సింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత బాలయ్య, గోపీచంద్ మలినేని కలయికలో తెరకెక్కుతోన్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నటుడు మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్న దర్శకుడు, మనోజ్ పోషించబోయే పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని, థియేటర్లలో ఆ మ్యాజిక్‌ను ప్రేక్షకులు ఎప్పుడు చూస్తారా అని తాను ఎంతగానో ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. కాగా ఈ సినిమాలో మనోజ్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. గతంలో 'ఊ..కొడతారా ఉలిక్కిపడతారా' చిత్రంలో కలిసి నటించిన బాలకృష్ణ, మంచు మనోజ్ మళ్లీ కలిసి నటిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి.ఈ భారీ బడ్జెట్ మూవీలో బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేస్తుండటం విశేషం. ఇందులో బాలయ్య సరసన కథానాయికగా నయనతార నటిస్తున్నారు. 'సింహా', 'శ్రీరామరాజ్యం', 'జైసింహా' వంటి ఘనవిజయాల తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న నాలుగో చిత్రం ఇది కావడంతో ఈ జంట మరోసారి బాక్సాఫీస్ వద్ద మేజిక్ రిపీట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఎస్.ఎస్. తమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండగా.. వృద్ధి సినిమాస్ ఈ సినిమాను నిర్మిస్తుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com